బడిలో ఎన్నికల గంట మోగింది

- 1810 ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌ఎంసీలకు ఎన్నికల షెడ్యూల్
- రేపటి నుంచే ఎన్నికల ప్రక్రియ
- 8న ఎన్నికల నిర్వహణ

ఏలూరు అర్బన్, జూలై 30: పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వం ఏర్పాటుచేసిన కమిటీలకు ఎన్నికల షెడ్యూల్‌ను మంగళవారం సాయంత్రం విడుదల చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2021లో నిర్వహించిన పేరెంట్స్‌ కమిటీల కాలపరిమితి గత ఏడాది సెప్టెంబరులో ముగిసింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం చేసింది. ఇప్పటి వరకు పేరెంట్స్‌ కమిటీలుగా వున్న వీటిని స్కూల్‌ మేనేజ్‌మెంట్‌ కమిటీ (ఎస్‌ఎంసీ)లుగా వ్యవహరిస్తారు. ఎన్నికలు ఆగస్టు 8న నిర్వహిస్తారు. జిల్లాలో మొత్తం 1810 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిలో 365 ప్రాథమికోన్నత, 462 ఉన్నత పాఠశాలలుకాగా, మిగితావన్నీ ప్రాథమిక పాఠశాలలు. రాజకీయాలకు అతీతంగా జరిగే ఎస్‌ఎంసీ ఎన్నికలప్రక్రియ ఆగస్టు 1న ఉదయం 10 గంటలకు నోటిఫికేషన్‌ జారీతో ప్రారంభమవుతుంది. అదేరోజు మధ్యాహ్నం 2గంటలకు ఓటర్ల జాబితాను నోటీస్‌ బోర్డులో ప్రదర్శిస్తారు. 5న ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటిగంటలోగా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు తెలియజేయడం, వాటిని పరిష్కరించడం జరగాలి. మధ్యాహ్నం 3గంటలకు తుది ఓటర్ల జాబితాను ప్రదర్శించాలి. 8న ఉదయం 7గంటలనుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకు ఎస్‌ఎంసీ సభ్యుల ఎన్నిక, మధ్యాహ్నం 1.30గంటలకు ఛైర్మన్‌, వైస్‌ఛైర్మన్‌ ఎన్నికలు, 2గంటలకు ఎస్‌ఎంసీ ప్రమాణస్వీకారం, 3గంటలకు కమిటీ తొలిసమావేశం జరుగుతాయి. చేతులెత్తడం లేదా తమ అభీష్టాన్ని వాయిస్‌ రూపంలో తెలియజేయడంద్వారా ఓటు హక్కును వినియోగించుకుంటారు. ఎక్కడైనా అసాధారణ పరిస్థితులు తలెత్తితే రహస్య బ్యాలెట్‌ ద్వారా ఎన్నికలు నిర్వహించాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు తహసీల్దార్‌, ఎంపీడీవో, గ్రామ కార్యదర్శి, వీఆర్వో, అసిస్టెంట్‌ వీఆర్‌ఏ పరిశీలకులుగా వ్యవహరిస్తారు. విద్యార్థి తండ్రి లేదా తల్లి లేదా సంరక్షకునిలో ఒకరికే ఓటుహక్కు ఉంటుంది. ఎస్‌ఎంసీలో ఎక్స్‌అఫీషియో మెంబర్లుగా స్కూల్‌ హెచ్‌ఎం, ఎంఈవో నియమించిన టీచరు, కార్పొరేటర్‌/కౌన్సిలర్‌/వార్డు మెంబర్లు, అంగన్‌వాడీ వర్కర్‌, ఏఎన్‌ఎం, మహిళా సమాఖ్య ప్రెసిడెంట్‌, ఇద్దరు విద్యావేత్తలు, స్వచ్ఛంద సేవా సంస్థ ఆఫీస్‌ బేరర్‌ ఉంటారు. సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ, కమ్యూనిటీ మొబలైజేషన్‌ ఆఫీసర్‌ (సీఎంవో) ఈ ఎన్నికల నిర్వహణను జిల్లాస్థాయిలో పర్యవేక్షిస్తారు.



వైసీపీ గప్‌చుప్‌



ఎన్నికల్లో ఫ్యాన్‌ రెక్కలు విరిగాయి. బటన్‌ నొక్కుడు ఏమాత్రం పనిచేయలేదు. ఐదేళ్లపాటు నువ్వెంత అంటూ రెచ్చిపోయే ధోరణిలో వ్యవహరించిన నేతలు, చిన్నాచితక వ్యవహారాలకే చిందులేసిన గ్రామస్థాయి కేడర్‌. అక్రమ కేసులు.. దాడులు, వీలైతే బెదిరింపులతో విరుచుకుపడ్డారు. ఇంతలా రెచ్చిపోయిన వైసీపీ ప్రస్తుతం మిన్నకుండిపోయింది. మాజీ ఎమ్మెల్యేలలు నియోజకవర్గ కేంద్రాలకు దూరంగా ఉన్నారు. పల్లె, పట్టణం తేడా లేకుండా చిన్నా చితక నేతలు ఎక్కడా కనిపించడం లేదు. మాజీ మిగిలిన కొద్దిపాటి మందిలో కూటమివైపు తొంగిచూస్తున్నారు.

- అధికారంలో ఉండగా విర్రవీగిన శ్రేణులు
- ఓటమితో ఒక్కసారిగా కుదేలు
- నియోజకవర్గాల్లో కనిపించని మాజీలు
- స్థానిక కేడర్‌లో గందరగోళం
- రాజకీయ భవిష్యత్‌పై అయోమయం
- వ్యక్తిగత పనులపై బెంగ
- కొందరు జనసేన వైపు మొగ్గు
- ఆచితూచి అడుగేస్తున్న కూటమి

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

అధికారంలో ఉండగా అంతా తామే అనుకున్నారు. అసలు సిసలైన పాలకులం మేమేనన్నారు. ఏం జరిగినా మా కనుసన్నల్లోనే జరగాలని ఆంక్షలు పెట్టారు. ఉద్యోగులను బెదిరించి మరీ పనులు చేయించారు. కిందిస్థాయిలో టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలను చూసుకుందాం రండి.. అంటూ సమయం, సందర్భం లేకుండా సవాళ్లు విసిరారు. గ్రామ వ్యవహారాల్లోనే కాదు నియోజకవర్గ వ్యవహారాల్లో సైతం ఇది మా రాజ్యం అనే ధోరణిలోనే తెగ రెచ్చిపోయారు. గోదావరి జిల్లాల్లో ప్రశాంతతను వైసీపీ నేతలు బ్రేక్‌ చేశారు. కొందరు రాజకీయ కక్షపూరిత వ్యవహారంతో పెత్తనం సాగించారు. ఇంకొందరు ఇసుకను తవ్వేశారు. మట్టిని మింగేశారు. ఎవరైనా ప్రతిపక్షానికి చెందిన వారు ధైర్యం చేసి ఫిర్యాదు చేస్తే ఇదంతా మామూలే అన్నట్టు అధికారుల నుంచి సమాధానం వచ్చేది. తిరుగులేదనుకున్న చోటల్లా గడిచిన ఎన్నికల్లో వేల ఓట్ల మెజార్టీతో కూటమి అభ్యర్థుల గెలుపు. వైసీపీ నేతల అడ్రస్‌ గల్లంతు. అధికార పగ్గాలు తమ చేతిలో ఉన్నాయన్న ధోరణితో ఆఖరుకు పోలీసులను తమ చేతుల్లోకి తీసుకుని ఇష్టానుసారం వ్యవహరించారు. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో వైసీపీ ఏలూరు జిల్లాలో అన్నిచోట్ల మట్టికరిచింది. భారీ మెజార్టీ కూటమి అభ్యర్థుల సొంతమైంది. ఒకప్పుడు రెచ్చిపోయిన వారంతా గడిచిన కొన్నాళ్లుగా అంతా సైలెంట్‌. మాజీ ఎమ్మెల్యేలతో సహా కొందరు గాయబ్‌. ఇంకొందరు ఇంటిపట్టునే ఉంటూ వచ్చీపోయే వారితో కాసేపు కాలక్షేపం. ఒకప్పుడు నెంబర్‌-2గా నియోజకవర్గాల్లో రెచ్చిపోయి వ్యవహరించిన అత్యధికులు సైతం నేడు అదృశ్యం కాగా కొందరు హైదరాబాద్‌లో ఉన్నారు.

ఉంగుటూరులో జనసేన వైపు?

ఉంగుటూరు నియోజకవర్గంలో పరిస్థితి మరో రకంగా ఉంది. ఇక్కడ జనసేన పక్షాన పత్సమట్ల ధర్మరాజు ఎమ్మెల్యేగా గెలుపొందారు. సాధ్యమైనంత మేర సామాజిక వర్గాన్ని ప్రామాణికంగా తీసుకుని వైసీపీకి చెందిన కొందరు జనసేన వైపు మొగ్గు చూపుతున్నారు.

వ్యక్తిగత అవసరాలు, పనుల దృష్ట్యా కొందరు తాపత్రయ పడుతున్నారు. మాజీ ఎమ్మెల్యే వాసుబాబు సైతం ఎవరికీ అందుబాటులో లేరు. నియోజకవర్గంలో ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో జనసేన సైతం ఆచితూచి అడుగేస్తోంది. చేరికలను ప్రోత్సహించే ధోరణి లేదు. అధినాయకత్వం నుంచి సానుకూల సంకేతాలు వస్తే తప్ప పార్టీలో చేరికలు ఉండకపోవచ్చు.

కోటగిరి అమెరికా.. అబ్బయ్యచౌదరి లండన్‌



అధికారం కోల్పోయి రాజకీయ భవిష్యత్‌, వ్యక్తిగత అవసరాల కోసం వైసీపీకి చెందిన అనేకమంది పక్క చూపులు చూస్తున్నారు. ఇంకొందరు సామాజిక అవసరాల కోసమంటూ జనసేనతో సంప్రదింపులు జరుపుతున్నారు. మాజీ ఎంపీ, వైసీపీ నేత కోటగిరి శ్రీధర్‌ గత ఎన్నికల్లో వెనుకడుగువేశారు. ఇప్పుడు ఆయన వర్గమంతా ఆయన ఆదేశాల మేరకు పార్టీలో ఉండాలా, లేక ఎవరి దారి వారు చూసుకోవాలా అనే సందిగ్ధంలో ఉన్నారు. మాజీ ఎంపీ శ్రీధర్‌ ప్రస్తుతం అమెరికాలో ఉన్నారు. కొద్దిరోజుల్లోనే జంగారెడ్డిగూడెం, చింతలపూడి, ఇతర మండలాల్లోని కేడర్‌ తమ భవిష్యత్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో తేల్చుకోబుతున్నారు. దశాబ్దాలపాటు కోటగిరి వర్గీయులుగా ఉన్న చింతలపూడిలోని కేడర్‌ ఎటూ తేల్చుకోలేకపోయింది. ఎన్నికల్లో వైసీపీ పక్షానే పనిచేసినా ఓటమి అనంతరం ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలో తెలియక సతమతమవుతున్నారు. చింతలపూడి వైసీపీ రాజకీయాల్లో ఎన్నికల సమయంలోనే అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. అప్పటి ఎమ్మెల్యే ఎలీజాను పక్కనపెట్టడంతో ఆయన పార్టీ నుంచి వైదొలిగి కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీ చేశారు. ఇదే స్థానం నుంచి రవాణ శాఖ అధికారి విజయరాజును వైసీపీ రంగంలో నిలిపినా ఫలితం దక్కలేదు. అనేక ఎత్తుగడలు, నగదు పంపిణీలో కూటమిపై పైచేయి సాధించినా జనా మోదంలో మాత్రం పూర్తిగా దెబ్బతిన్నారు. ఇప్పుడు చింతల పూడి నియోజకవర్గంలో వైసీపీ కేడర్‌, నేతలు సైలెంట్‌గా ఉన్నారు. ఎటూ పాలుపోక ఓటమి నుంచి తేరుకోక ఎవరితో కనీస సంప్రదింపులకు సాహసించలేని స్థితిలో ఉన్నారు. ముఖ్యనేతలు మాత్రం ఈ విషయంలో జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. టీడీపీ కూడా వైసీపీ నుంచి వచ్చేందుకు సుముఖంగా ఉన్న వారిని పార్టీలోకి చేర్చుకుంటే నష్టమని, కొంత సంయమనం పాటించాలనే ధోరణిలో ఉంది. దెందులూరులో ఓటమి తర్వాత అబ్బయ్యచౌదరి లండన్‌ వెళ్లారు. ఆయన సన్నిహితుల్లో అత్యధికులు నియోజకవర్గాన్ని వీడి వ్యక్తిగత పనులంటూ ఇతర ప్రాంతాలకు వెళ్లారు. ఎన్నికలకు ముందు అప్పటి ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి వర్గం చింతమనేని వర్గంపై విరుచుకుపడుతూ వచ్చింది. అనేకసార్లు దాడులకు దిగింది. మట్టి తవ్వకాల్లో మాత్రం అందరికంటే ముందంజ వేసింది. పోలవరం కుడికాలువ గట్టును ఎక్కడికక్కడ తవ్వి తరలించారు. దీనిని అడ్డుకోవడానికి ప్రయత్నించిన టీడీపీ నేతలపై కేసులు పెట్టారు. దెందులూరులో వైసీపీ నేతల్లో అత్యధికులు పార్టీలోనే కొనసాగుతామని, ఇతర పార్టీల్లోకి వెళ్లేది లేదంటూ కొంత బింకం ప్రదర్శిస్తున్నారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ పార్టీకి జీవం పోసేలా కేడర్‌ కోసం పూర్తి సమయం కేటాయిస్తున్నారు.

నూజివీడు, కైకలూరు సైలెంట్‌

నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల్లో వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు, ద్వితీయ శ్రేణి కేడర్‌ పూర్తిగా సైలెంట్‌ అయ్యారు. రెండుచోట్ల కూటమికి ఎదురు తిరిగే పరిస్థితి లేదు. గడిచిన ఐదేళ్ల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఎదురు తిరిగినా తమకే నష్టమని ఒదిగి ఉన్నారు. కైకలూరులో కొంతమంది ఎంపీపీలు, జడ్పీటీసీలు మాత్రం కూటమి వైపు మొగ్గు చూపే ప్రయత్నంలో ఉన్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లో కొద్ది రోజుల వ్యవధిలోనే వైసీపీలో అటో ఇటో తేలబోతుంది. కైకలూరు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ఇంటి పట్టునే ఉంటున్నారు. నూజివీడులో ప్రతాప అప్పారావు వ్యక్తిగత వ్యవహారాల్లో బిజీగా గడుపుతున్నారు. పోలవరం నియోజకవర్గంలో వైసీపీ పూర్తిగా సైలెంట్‌ అయిపోయింది. ఈ నియోజకవర్గంలో తెల్లం బాలరాజు సతీమణి ప్రభుత్వ టీచర్‌ రాజ్యలక్ష్మిని గడిచిన ఎన్నికల్లో పోటీకి దింపినా ఓటమి తప్పించుకోలేకపోయారు. దీంతో ఇప్పటికే వైసీపీ కేడర్‌ పూర్తిగా డీలా పడింది.

ఏలూరు మాజీ అదృశ్యం!

ఏలూరు నియోజకవర్గంలో 65 వేలకుపైగా మెజార్టీతో గెలుపొందిన టీడీపీ ఎమ్మెల్యే బడేటి చంటి ఎక్కువ సమయం ప్రజల మధ్యనే కేటాయిస్తున్నారు. మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని మాత్రం ఎన్నికల తరువాత అదృశ్యమయ్యారు. నియోజకవర్గంలో ఆయన ఎవరితోను ముఖాముఖి భేటీకి సిద్ధపడడం లేదు. వైఎస్‌ రాజశేఖరరెడ్డి నుంచి ఆ కుటుంబానికి సన్నిహితంగా ఉంటున్న నాని ఘోర పరాజయంతో ముఖం చాటేశారు. ఎన్నికల ముందు వరకు ఆయనతోనే ఉన్న ముఖ్య నేతలంతా ఒక్కొక్కరిగా పార్టీకి రాజీనామా చేశారు. ఎక్కడా లేనంత వ్యతిరేకత ఇక్కడే కనిపించడంతో నానికి వెన్నంటే ఉన్న మంచెం మైబాబు, బొద్దాని శ్రీనివాస్‌ సైతం ఇటీవల పార్టీకి రాజీనామా చేశారు. మేయర్‌ నూర్జహాన్‌, ఆమె భర్త పెదబాబు, ఇంకొందరు కార్పొరేటర్లు సైతం వైసీపీకి దూరంగా జరిగారు. ఇది ఏలూరులో ఆ పార్టీకి పెద్ద దెబ్బే తగిలింది.



కుక్కునూరు గుండేటివాగు తీరంలో పెరుగుతున్న గోదావరి

మళ్లీ పెరుగుతున్న గోదావరి

- కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు వరద
- బయట పడుతున్న ఇళ్లు తిరిగి ముంపులో..
- పోలవరం వద్ద 10 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల
- పట్టిసీమ నుంచి 6,726 క్యూసెక్కులు

కుక్కునూరు/వేలేరుపాడు/పోలవరం, జూలై 30: గోదావరి వరద మళ్లీ నెమ్మదిగా పెరుగుతోంది. మంగళవారం ఉదయం 5గంటలకు 42.70, సాయంత్రం 5 గంటలకు భద్రాచలం వద్ద 43.50 అడుగుల నీటిమట్టం నమోదైంది. 43 అడుగులు దాటడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఉదయం నుంచి గోదావరి వరద నెమ్మదిగా పెరుగుతూనే ఉంది. మరో రెండు రోజులు నెమ్మదిగా పెరుగుతూనే ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కుక్కునూరు మండలంలో 8గ్రామాలకు 881మంది పునరావాస కాలనీలో ఉంటున్నారు. గోదావరి మళ్లీ పెరుగుతుండడంతో వేలేరుపాడు మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పది రోజులుగా మండల ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న గోదావరి వరద తగ్గుతూ పెరుగుతూ దోబూచులాడుతుంది. ఇప్పుడిప్పుడే ఇళ్లు బయట పడుతున్న తరుణంలో మరోసారి వరద పెరుగుతోంది.

పోలవరంలో గోదావరి నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి 23.337 మీటర్లకు చేరడంతో 10 లక్షల క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేసినట్లు సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. పోలవరం ప్రాజెక్టులోకి వస్తున్న వరద జలాలను 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న 10,08,762 క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేశారు. స్పిల్‌వే ఎగువన 32.710 మీటర్లు, దిగువన 24.300 మీటర్లు నీటి మట్టం నమోదైంది. కడమ్మ వంతెనపై నీటిమట్టం పూర్తిగా తగ్గడంతో ప్రాజెక్టుకు రాకపోకలు కొనసాగుతున్నాయి. కడమ్మ స్లూయిజ్‌ గేట్లు మూసుకుపోయి ఏటిగట్టుకు కుడివైపున 20 రోజులుగా పంటపొలాలు ముంపులో ఉన్నాయి. పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 6,726 క్యూసెక్కుల జలాలు విడుదల చేసినట్టు డీఈఈ పెద్దిరాజు తెలిపారు. 20 మోటార్లు 20 పంపులతో పట్టిసీమ నుంచి నీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

పర్యావరణం పరిరక్షించాలి

ఆర్డీవో ఖాజావలి



సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీవో ఖాజావలి

ఏలూరు క్రైం/కైకలూరు, జూలై 30: పర్యావరణ పరిరక్షణకు అందరూ సహకరించాలని ఆర్డీవో ఖాజావలి తెలిపారు. కైకలూరు తహసీల్దార్‌ కార్యాలయంలో జిల్లా కోస్టల్‌ జోన్‌ మేనేజ్‌మెంట్‌ ప్లాన్‌ ఖరారుకు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు ఆర్డీవో అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ తీర ప్రాంతాల్లో మత్స్యకార సంఘాలు, ఇతర స్థానిక వర్గాలకు జీవనోపాధి భద్రత కల్పించడంతోపాటు తీర ప్రాంతాలు, సముద్ర ప్రాంతాల ప్రత్యేక పర్యావరణాన్ని రక్షించడం ప్రధాన లక్ష్యం అన్నారు. సముద్ర తీర ప్రాంతం కలుషితం కాకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రజల సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. అభివృద్ధి చెందిన ప్రాంతాలను సీఆర్‌జెడ్‌ పరిధి నుంచి తప్పించి రైతుల సంక్షేమం కొరకు కృషి చేయాలని చేపల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాడినాడ బాబు అన్నారు. ఆక్వా కల్చర్‌పై ఆంక్షలుంటే ముందుగానే రైతులకు వివరించాలని కోరారు. పలువురు రైతులు మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణ సమావేశంపై సరైన సమాచారం లేదని, ప్రజలు, రైతులంతా పాల్గొనలేకపోయారని ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు అన్ని గ్రామాల సర్పంచ్‌లకు సమాచారం అందించినట్లు తప్పుదారి పట్టిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పొల్యూషన్‌ కంట్రోల్‌ బోర్డు ఈఈ కె.వెంకటేశ్వరరావు, పీవీబీఎల్‌.శాస్త్రి, ఎన్‌సీఎస్‌ఈ సౌందర్యరాజన్‌, డీపీవో తూతిక శ్రీనివాస విశ్వనాథ్‌, ఫారెస్ట్‌, టూరిజం, మత్స్యశాఖ, వ్యవసాయ శాఖ అధికారులు, గ్రామ పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



వరదలో మునిగిన ఇళ్లు (ఫైల్‌)

వరద సహాయంలో వివక్ష

మునిగిన ఇళ్లకు పరిహారం చెల్లించని అధికారులు

వేలేరుపాడు, జూలై 30:మండలంలో వరద బాధిత గ్రామాల ప్రజలకు ప్రభుత్వం బియ్యం, నిత్యావసర సరుకులు కూరగాయలు రూ.3 వేలు పరిహారం ప్రకటించింది. పునరావాస కేంద్రాలకు తరలించిన వారికి బియ్యం, నిత్యావసర సరుకులు, కూరగాయలు, పంపిణీ చేశారు. రూ.3వేలు నగదు అందించారు. వేలేరు పాడులోని సంతమార్కెట్‌ సెంటర్‌, రజకబజారులో ఇళ్లు మునిగినా కూరగాయలు తప్ప మరే సహాయాన్ని అందించకుండా వివక్ష చూపుతున్నారని బాధితులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. నేటి వరకు బియ్యం కూడా ఇవ్వలేదని మండల కేంద్రం ప్రజలు మండిపడుతున్నారు. దాదాపు మండల కేంద్రం చుట్టూ గోదావరి వరద చుట్టుముట్టింది. పనులు లేక, తిండి లేక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ముంపు గ్రామాల్లో సహాయం అందించిన అధికారులు మండల కేంద్రంలో ఎందుకు ఇవ్వరని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దార్‌ చిన్నారావును వివరణ కోరగా వేలేరుపాడులో మూడో ప్రమాద హెచ్చరిక దాటిన తరువాత వరద వచ్చిందని, ముంపు ఇళ్ల జాబితా కలెక్టర్‌కు పంపించామని, నిధులు విడుదలైతే మునిగిన ఇళ్లకు మాత్రమే పరిహారం చెల్లిస్తామని తెలిపారు.

జిల్లాలో సరాసరి వర్షపాతం 18.6 మి.మీ.

ఏలూరు సిటీ, జూలై 30: జిల్లాలో మంగళవారం పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. గడచిన 24 గంటల్లో అత్యధికంగా పెదవేగి మండలంలో 44.2 మి.మీ., జిల్లాలో సరాసరి 18.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఉంగుటూరులో 43.4, కుక్కునూరు 41, భీమడోలు 33.8, చింతలపూడి 29.4, టి.నరసాపురం 29, లింగపాలెం 28.4, చాట్రాయి 26.6, ముసునూరు 26, వేలేరుపాడు 24, కామవరపుకోట 21.6, జంగారెడ్డిగూడెం 18.4, ద్వారకాతిరుమల 17.4, పోలవరం 16.2, కలిదిండి 14.6, పెదపాడు 14.4, నూజివీడు 12.4, మండవల్లి 11.2, బుట్టాయిగూడెం 10.8, ఆగిరిపల్లిలో 9.4 మి.మీ. వర్షపాతం నమోదైంది.




తమ్మిలేరు.. జలకళ

తమ్మిలేరు రిజర్వాయర్‌ జలకళ సంతరించుకుంది. అధిక వర్షాలతో పరీవాహక ప్రాంతం, ఎగువ నుంచి వరద నీరు చేరడంతో జలాశయం కళకళలాడుతోంది. రిజర్వాయర్‌ సామర్థ్యం 355 అడుగుల నీటి మట్టం కాగా ప్రస్తుతం 349.49 అడుగుల నీరు ఉంది. ప్రాజెక్టు నిర్మించిన తరువాత ఇప్పటివరకు జూలైలో రిజర్వాయర్‌ ఎండిపోయి ఉంటుందని, దిగువకు నీరు వదిలే పరిస్థితి ఇదే ప్రథమం అని రైతులు చెబుతున్నారు.

- 349.49 అడుగులకు చేరిన నీటిమట్టం
- ఎగువ నుంచి 657 కూసెక్కుల నీరు చేరిక
- 250 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల

చింతలపూడి, జూలై 30: తమ్మిలేరు రిజర్వాయర్‌ రెండు బేసిన్‌లుగా నిర్మాణం జరిగింది. ఎగువ నుంచి వచ్చే వరద తమ్మిలేరు జలాశయానికి చేరి లింక్‌ ఛానెల్‌ ద్వారా గోనెలవాగు బేసిన్‌లోకి వరద నీరు వెళుతోంది. రెండు బేసిన్‌లలో నీటిమట్టం నిలకడగా ఉంచుతారు. గోనెలవాగు నుంచి మంకొల్లు కాలువ ద్వారా 1095 ఎకరాలు, కుడి కాలువ ద్వారా పోలవరం, చాట్రాయి, తుమ్మగూడెం, సోమవరం, మర్లపాలెం గ్రామాలకు 4వేల ఎకరాలకు సాగునీరు వెళుతుంది. ఎడమ కాలువ పశ్చిమలోని తెలార్లపల్లి, యర్రంపల్లి, యడవల్లి, లింగపాలెం, కల్యాణంపాడు గ్రామాల్లోని 4వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. తమ్మిలేరు రిజర్వాయర్‌ ఎగువ ప్రాంతంలో తుమ్మూరు వద్ద చెక్‌డ్యామ్‌ వంటి అడ్డుగోడ నిర్మించి ఎడమవైపు ఆంధ్రా కాలువ, కుడివైపు తుమ్మూరు కాలువగా సాగునీరు అందేలా తూములు నిర్మించారు. ఆంధ్రా కాలువ ద్వారా చింతలపూడి మండలంలోని 21 చెరువులకు నీరు చేరి 7 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఆంధ్రా కాలువకు చింతలపూడి మండలం గణిజర్ల వరకు కాలువలు నిర్మించారు. కాలువలు ఇప్పుడు పూడుకుపోయి చెట్లు మొలిచి అధ్వానంగా మారింది. వీటిని తొలగించి సాగు నీరు సరఫరా అయ్యేవిధంగా చూడాలని రైతులు కోరుతున్నారు. తమ్మిలేరు రిజర్వాయర్‌ వరద నిరోధక ప్రాజెక్టుగా నిర్మించినా వరద ఎక్కువగా ఉన్నప్పుడు గేట్లు ద్వారా వచ్చేనీటిని కూడా వినియోగించుకోడానికి ధర్మాజీగూడెం వద్ద పాలవాగు ఛానెల్‌, దిగువన విజయరాయి వద్ద చెక్‌డ్యామ్‌ నిర్మించారు. ఈ విధంగా తమ్మిలేరు ఎగువ, దిగువ కలిపి వరద నీరు అధికంగా వచ్చిన సమయంలో సుమారు 30వేల ఎకరాలకు పైగా సాగునీటిని రైతులు ఉపయోగించుకుంటున్నారు. అదనపు నీరు ఏలూరు వద్ద తూర్పు, పశ్చిమ లాకుల ద్వారా కొల్లేరులో వరద నీరు చేరుతుంది.



250 క్యూసెక్కుల నీరు విడుదల

తమ్మిలేరు రిజర్వాయర్‌లో ప్రస్తుత నీటి మట్టం 349.49 అడుగులు. ఎగువ నుంచి 657 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. రెగ్యులేటర్‌ మూడుగేట్లు ఎత్తివేసి దిగువకు 250 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఏఈ పరమానందం తెలిపారు.

చింతలపూడి ఎత్తిపోతలే శరణ్యం

తమ్మిలేరు రిజర్వాయర్‌కు ఎగువ బేతుపల్లి చెరువు అలుగు నీరు వస్తేనే రిజర్వాయర్‌కు వరద నీరు వస్తుంది. బేతుపల్లి అలుగునీరు వినియోగించుకునే విధంగా గోడలు, గట్లు ఎత్తు పెంచి అదనపు నీటిని తెలంగాణ వినియోగించుకుంటుంది. 2006లో చింతలపూడి ఎత్తిపోతల పథకం ప్రారంభించారు. నాబార్డు నుంచి రుణం మంజూరైనప్పటికి గత ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్కపైసా కూడా ఖర్చు చేయలేదు. ఇప్పటికైనా ఈ పథకం పూర్తిచేసి మెట్టప్రాంతానికి సాగునీరు అందిస్తూ తమ్మిలేరు జలాశయానికి కూడా నీరు మళ్లించాలని రైతులు కోరుతున్నారు. రిజర్వాయర్‌ కాలువలు, తూములు దెబ్బతినడంతో మరమ్మతుల కోసం జైకా నిధులు రూ.13కోట్లు మంజూరయ్యాయని, పనులు జరుగుతున్నాయని, నీటిపారుదల శాఖ డిఈ శ్రీనివాస్‌ తెలిపారు.



గంజాయి విక్రేతల వివరాలు చెబుతున్న సీఐ కృష్ణకుమార్‌

గంజాయి విక్రేతలు అరెస్టు

కలిదిండి, జూలై 30: గంజాయి విక్రయిస్తున్న నలుగురిని మంగళవారం అరెస్టు చేసినట్లు కైకలూరు సీఐ కృష్ణ కుమార్‌ తెలిపారు. ఎలికే రాజేష్‌ (దేవపూడి), అనుతొత్తరంపూడి సురేంద్ర (సానారుద్రవరం), కొడాలి నాగేంద్ర వర్మ (కలిదిండి), సయ్యద్‌ నవయుత్‌ (కైకలూరు) గంజాయి మత్తుకు అలవాటుపడ్డారు. విక్రయాలు కూడా సాగిస్తున్నారు. రాజమండ్రి సమీపంలో గోకవరం నుంచి 15 రోజుల క్రితం గంజాయి తెచ్చి వెంకటాపురం పంట కాల్వ వద్ద దాచారు. అమ్మడానికి తీసుకెళ్తుండగా ఎస్‌ఐ ప్రియకుమార్‌కు సమాచారం అందింది. ఎస్పీ కె.ప్రతాప్‌ శివ కిషోర్‌ ఆదేశాల ప్రకారం డీఎస్పీ ఈ.శ్రీనివాసులు ఆధ్వర్యంలో కైకలూరు సీఐ కృష్ణ కుమార్‌ నలుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద 22 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరచడంతో కోర్టు రిమాండ్‌ విధించింది.

నెలన్నరలో 72 మందికి పదోన్నతులు : ఐజీ

ఏలూరు క్రైం, జూలై 30 : ఏలూరు రేంజ్ పరిధిలోని గడిచిన 42 రోజుల కాల వ్యవధిలో మొత్తం 72 మంది పోలీస్ సిబ్బందికి పదోన్నతులు కల్పించినట్లు ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ తెలిపారు. పదోన్నతులు పొందిన వారిలో ముగ్గురు ఎస్‌ఐలకు ఇన్‌స్పెక్టర్లుగా, 36 మంది హెచ్‌సీ/ఏఎస్‌ఐలకు ఎస్‌ఐలుగా పదోన్నతి కల్పించామన్నారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలకు సంబంధించి 17 మంది హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్‌ఐలుగా పదోన్నతి ఇచ్చామన్నారు. ముగ్గురు ఏఆర్ఎస్ఐలకు ఆర్ఎస్ఐలుగా, 12 మంది ఎఆర్ హెడ్ కానిస్టేబుళ్లకు ఏఆర్ ఎస్‌ఐలుగా పదోన్నతులు ఇచ్చామన్నారు. ఒక సీనియర్ అసిస్టెంట్‌కు ఆఫీసర్ సూపరింటెండెంట్ పదోన్నతి కల్పించామన్నారు. పదోన్నతులు పొందిన వారిలో ముగ్గురు ఏఎస్‌ఐలు జూన్ నెలలో రిటైరవగా, బుధవారం మరొకరు పదవీ విరమణ చేయనున్నారు. వారికి ఎస్‌ఐలుగా పదోన్నతి వచ్చే విధంగా డిపార్ట్‌మెంటల్ విభాగాధిపతులతో మాట్లాడి వారి వద్ద ఉన్న ఖాళీలను కూడా భర్తీ చేసి వారికి పదోన్నతులు ఇచ్చామన్నారు. త్వరితగతిన రికార్డులు తనిఖీ చేసి ప్రక్రియను సుసాధ్యం చేసిన డీఐజీ కార్యాలయ మేనేజర్ నాగరాజు, రేంజ్ కార్యాలయ సిబ్బందిని ఐజీ అభినందించారు.



పోటీ బ్రోచర్‌తో నిర్వాహకులు, విద్యార్థినులు

స్వాతంత్య్ర వేడుకల్లో జిల్లా స్థాయి పోటీలు

భీమవరం టౌన్, జూలై 30 : భారత స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా ఆయా కళాశాలలు, పాఠశాలలో జిల్లాస్థాయి పోటీలను నిర్వహిస్తున్నామని ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రాజేష్, ప్రోగ్రాం కన్వీనర్ చెరుకువాడ రంగసాయి తెలిపారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో పీఎస్ఎం గర్ల్స్ హైస్కూల్లో బ్రోచర్ ఆవిష్కరించారు. వచ్చేనెల 3 నుంచి 9వ తేదీ వరకు జిల్లా స్థాయిలో పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. వివరాలకు 81439 14303, 99123 22269 నంబర్లకు వాట్సప్ ద్వారా తెలియ జేయాలని కోరారు. దేశ నాయకుల చరిత్ర, పర్యావరణ పరిరక్షణ, అధిక జనాభా అనర్థాలు, క్రీడా రంగం-కళ రంగం తదితర అంశాలపై పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. వచ్చేనెల 17న క్విట్ ఇండియా దినోత్సవం పురస్కరించుకుని ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేస్తామని తెలిపారు. సహకారెట్టి కృష్ణ, హైస్కూల్ హెచ్‌ఎం వారణాసి రాధాకృష్ణ, ఉపాధ్యాయులు శ్రీదేవి, సునీత, నందమూరి రాజేష్, అరసవల్లి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

డీఎల్ఎడ్ పరీక్షలకు ఫీజు చెల్లించండి

ఏలూరు అర్బన్, జూలై 30 : డిప్లొమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎల్ఎడ్) పరీక్షలకు అపరాధ రుసుం లేకుండా ఆగస్టు 11లోగా, ఫైన్ రూ.50తో కలిపి ఆగస్టు 19లోగా చెల్లించాలని డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో కోరారు. పరీక్షలు సెప్టెంబరులో జరుగుతాయన్నారు.

పాడి రైతులకు మంచి రోజులు



పథకాలను పక్కన పడేసిన వైసీపీ ప్రభుత్వం
పునఃప్రారంభిస్తున్న కూటమి ప్రభుత్వం
రైతుల్లో వెల్లివిరుస్తున్న ఆనందం

ఏలూరు టూటౌన్/ భీమవరం రూరల్ జూలై 30: రాష్ట్రంలో వ్యవసాయ రంగం తరువాత అంతటి ప్రాధాన్యం గల రంగం పాడి పరిశ్రమ. పాడి రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకుపాల దిగుబడులు పెంచేందుకు గతంలో టీడీపీ ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టింది.వైసీపీ ప్రభుత్వం పథకాలన్నింటిని రద్దు చేసి పాడి రైతుల నోట్లో మట్టికొట్టింది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్కొక్క పథకాన్ని పునఃప్రారంభించే ఏర్పాట్లు చేస్తున్నది. ఇప్పటికే మినీ గోకులం పథకాన్ని ప్రారంభించింది. ఆర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వా నించింది. పశువులకు అవసరమైన గడ్డిని పెంచుకునేందుకు ఉపాధీ పశుగ్రాస క్షేత్రాలు పథకాన్ని పునఃప్రారంభిస్తున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు ఇటీవల ప్రకటించారు. దీంతో పాడి రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

మినీగోకులం పథకం ప్రారంభం

2014-19 సంవత్సరాల మధ్య టీడీపీ ప్రభుత్వం మినీగోకులం పథకాన్ని ప్రారంభించింది. వైసీపీ ప్రభుత్వం రాగానే ఈ పథకాన్ని రద్దు చేసింది. అంతేకాక షెడ్లు నిర్మించుకున్న రైతులకు ప్రభుత్వం చెల్లించాల్సిన రాయితీలు చెల్లించలేదు. ప్రభుత్వ రాయితీలు మాకు వద్దు బాబు మేము కట్టిన సొమ్ము అయినా మాకు ఇవ్వండి అని అన్నా కాని ఆనాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. మినీగోకులం పథకంలో రెండు పశువులకు షెడ్డు నిర్మించుకోవడానికి లక్షా 15 వేలు టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో 90 శాతం రాయితీతో 1,03,500 ఇచ్చింది. లబ్ధిదారుల వాటా 10 శాతం 11,500 చెల్లించాలి. అలాగే నాలుగు పశువులకు లక్షా 85 వేలు అయితే రాయితీ 1,66,500, రైతు వాటా 18,500, ఆరు పశువుల షెడ్డుకు యూనిట్ విలువ 2 లక్షల 30 వేలు. దీనిలో ప్రభుత్వ రాయితీ 2 లక్షల 7500, రైతు చెల్లించాల్సినది 23వేలు.గొర్రెలు, మేకలు, కోళ్లకు షెడ్డు నిర్మించు కునేందుకు 70 శాతం ప్రభుత్వం రాయితీ కల్పించింది. 30 శాతం రైతులు భరించాలి. 20 గొర్రెలు, 20 మేకలకు షెడ్డు నిర్మించుకోవడానికి యూనిట్ విలువ రూ.లక్షా 30 వేలుగా ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో 91 వేలు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. రైతులు 39 వేలు చెల్లించాల్సి ఉంటుంది. 50 గొర్రెలు, 50 మేకలకు షెడ్డు నిర్మాణానికి రూ.2 లక్షల 30 వేలుగా ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో ప్రభుత్వం రూ.లక్షా 61 వేలు రాయితీ ఇస్తుంది. రూ.69 వేలు రైతు కట్టాల్సి ఉంటుంది. 100 కోళ్ల పెంపకానికి రూ.లక్షా 32 వేలు షెడ్డు నిర్మాణానికి అయితే ఇందులో 92 వేలు రాయితీ ప్రభుత్వం ఇస్తుంది. రైతులు 39 వేలు భరించాల్సి ఉంది. జిల్లాలో 756 మినీగోకులం షెడ్లు

ఏలూరు జిల్లాలో 1,35,607 ఆవులు, 5,06,110 గేదెలు, 5,26,836 గొర్రెలు, 1,98,810 మేకలు, 7618 పందులు, పౌల్ట్రీ కోళ్లు 11,86,075 ఉండగా పశ్చిమ గోదావరి జిల్లాలో 45,539 ఆవులు, 1,78,137 గేదెలు, 38,804 గొర్రెలు, 22,765 మేకలు, 43,04,397 కోళ్లు ఉన్నాయి..

రైతులు నిర్మించుకున్నారు. వీటిలో 384 షెడ్లకు ప్రభుత్వం డబ్బులు చెల్లించింది. మిగిలిన 402 షెడ్ల యజమానులు బిల్లులు మిగిలిపోయాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో 1338 షెడ్లకు గాను 742 పూర్తి చేశారు. మిగిలినవి అసంపూర్తిగా ఉన్నాయి

పశు బీమా పథకం

ప్రమాదవశాత్తు పాడిపశువు చనిపోతే అప్పటి టీడీపీ ప్రభుత్వం పశు నష్టపరిహారం కింద రూ.30 వేలు రైతుకు అందించేది. అలా ఒక రైతుకు ఎన్ని గేదెలు చనిపోయినప్పటికి అన్ని గేదెలకు నష్టపరిహారం చెల్లించింది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత బీమా పేరుతో 30 శాతం రైతులతో కట్టించింది. అది కూడా సరిగా అమలు చేయలేదు. చాలా మంది రైతులు పాడి పశువులను కోల్పోయి ఆటు నష్టపరిహారం అందక చాలా ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మళ్లీ



పశు బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఒక కుటుంబంలో ఆరు గేదెలు వరకు మరణిస్తే నష్టపరిహారం చెల్లించేది. టీడీపీ ప్రభుత్వం ఎన్ని పశువులు చనిపోతే అన్ని పశువులకు నష్టపరిహారం అందించేది.

వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన పథకాలు

హర్యానా, పంజాబ్ రాష్ట్రాల నుంచి పాడి గేదెలు, పాడి ఆవులను కొనుగోలు చేసి 75 శాతం రాయితీతో అర్హులైన రైతులకు అందించేది. పశువు దాణాకు దాణా సరఫరా, బీమా కోసం సునందిని పథకాన్ని 75 శాతం సబ్సిడీతో ఉన్న పథకాన్ని వైసీపీ రద్దు చేసింది. ఈ పథకం ఈనక ముందు మూడు నెలలు, ఈనిన తరువాత 3 నెలల వరకు 75 శాతం సబ్సిడీతో దాణా సరఫరా, బీమా సౌకర్యంతో ఉన్న క్షీరసాగర పథకాన్ని కూడా వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. పాల ఉత్పత్తిని పెంచేందుకు పాడుకు గడ్డి సరఫరా, సమీకృత దాణా కోసం 90 శాతం సబ్సిడీతో వైఎస్‌ఐజీ పథకాన్ని రద్దు చేసింది. ఈ పథకాలన్నింటిని కూటమి ప్రభుత్వం పున రుద్ధరించాలని రైతులు కోరుకుంటున్నారు.

సిబ్బంది ఇలా..

ఏలూరు జిల్లా : జాయింట్ డైరెక్టర్ 1, డిప్యూటీ డైరెక్టర్లు ఇద్దరు, అసిస్టెంట్ డైరెక్టర్లు 12 మంది, వెటర్నరీ డాక్టర్లు 70 మందికి 52 మంది ఉన్నారు. వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్లు 11, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్లు 19, లైవ్ స్టాక్ అసిస్టెంట్ 45, వెటర్నరీ అసిస్టెంట్లు 52 మందికి 35 మంది ఉన్నారు. ఆఫీస్ సబార్డినేట్స్ 29 మంది, యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్స్ 312 మంది, గోపాలమిత్రలు 138 మంది ఉన్నారు.

పశ్చిమ గోదావరి జిల్లా : జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి 1, డిప్యూటీ డైరెక్టర్లు - 4, అసిస్టెంట్ డైరెక్టర్లు- 14, వెటర్నరీ డాక్టర్లు 52 మందికి 34 మంది పనిచేస్తున్నారు. 18 ఖాళీగా ఉన్నాయి. వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్లు 7 మంది, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్లు 18 మందికి 17 మంది, లైవ్ స్టాక్ ఆఫీసర్లు - 15 , వెటర్నరీ అసిస్టెంట్లు 46 మందికి 9 మంది, పశు సంవర్ధక సహాయకులు 182 మంది, గోపాలమిత్రలు 49 మంది పనిచేస్తున్నారు.

ఆర్ఎంపీలు, పీఎంపీలు ప్రథమ చికిత్సకే పరిమితం

నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తే చర్యలు : డీఎంహెచ్‌వో

ఏలూరు అర్బన్, జూలై 30 : నిబంధనలకు విరుద్ధంగా ఆర్ఎంపీలు, పీఎంపీలు వైద్యం చేస్తే వారిపై చట్టపరమైన కఠినచర్యలు తప్పవని డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ హెచ్చరించారు. మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆర్ఎంపీలు, పీఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, వారు నిర్వహించే క్లినిక్‌లకు వచ్చే వారిని సమీపంలోని ప్రభుత్వ పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులకు పంపించాలని సూచించారు. దీనికి విరుద్ధంగా వైద్యం చేయడం, మందులు, ఇంజక్షన్ల ద్వారా చికిత్స అందించి వ్యాధి తీవ్రం అయిన తర్వాత ప్రభు త్వాసుపత్రులకు పంపించడం వల్ల అప్పటికే వారు సీరియస్ కండీషన్‌కు చేరి ప్రాణాపాయ స్థితికి వెళుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఆర్థికంగా, శారీరకంగా అన్ని విధాలా నష్టపోతున్నారని వివరించారు.ఏదైనా పీఎంపీలు, ఆర్ఎంపీలు నిబంధ నలను అతిక్రమించి వైద్యం చేస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

మరో ఇద్దరు ఆర్ఎంపీలకు షోకాజ్ నోటీసులు

నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తున్న పెదవేగి మండలం కూచింపూడి, పెదవేగి గ్రామాలకు చెందిన ఇద్దరు ఆర్ఎంపీలకు మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు డీఎంహెచ్‌వో కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. స్థాని కుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు వివరించారు. జ్వరంతో వచ్చిన వారికి ఆర్ఎంపీలు ఇష్టానుసారం వైద్యం చేస్తున్నట్లుగా ఫిర్యాదులొచ్చాయని పేర్కొన్నారు. జిల్లాలో ఎన్ఎంసీ సెంటర్లు నిర్వహిస్తోన్న ఆర్ఎంపీలు, పీఎంపీల వద్ద వివరాలను సేకరించి జాబితాను పంపాల్సిందిగా స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులను డీఎంహెచ్‌వో కార్యాలయ అధికారులు ఆదేశించారు. నిర్దిష్ట ప్రొఫార్మాలో సంబంధిత ఆర్ఎంపీ / పీఎంపీ ఫోటో, ఫస్ట్ ఎయిడ్ సెంటర్ పేరు, వారి విద్యార్హతలు, అందిస్తోన్న వైద్యసేవలు తదితర సమాచారాన్ని కోరినట్లు అధికార వర్గాలు వివరించాయి. జిల్లాలో అధికారికంగా 800 మంది పైబడి ఆర్ఎంపీలు/పీఎంపీలు ఉన్నట్లుగా ప్రాథమికంగా సమాచారం అందింది. మరికొందరు అనధికారికంగా సెంటర్లు నిర్వహిస్తున్నట్టుగా తెలుస్తోందని పేర్కొన్నారు. జిల్లాలో సుమారు 200 మందికి నోటీసులు జారీచేసిన నేపథ్యంలో వీరందరిపైనా ఒక్కసారిగా చర్యలు తీసుకుంటే క్షేత్రస్థాయిలో స్థానికులు ఇబ్బందులు పడతారని భావిస్తోన్న వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యామ్నాయాలపై దృష్టి సారిస్తోంది. ముందుగా ఆర్ఎంపీలు, పీఎంపీలతో సమావేశాన్ని నిర్వహించి వారందించాల్సిన ప్రాథమిక వైద్యం, పాటించాల్సిన నియమాలపై సూచనలు చేసిన తర్వాత కూడా ఉల్లంఘనలకు పాల్పడేవారిపై చర్యలు తీసు కోవడం సబబుగా ఉంటుందని ఓ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. దీనిపై అధికారికంగా డీఎంహెచ్‌వో కార్యాలయ వర్గాలు స్పందించడానికి నిరాకరించాయి.

హాస్టల్..అధ్వానం

శిథిలావస్థలో బాలికల వసతి గృహం
తలుపులు లేని మరుగుదొడ్లు
మౌలిక వసతులు లేక విద్యార్థినుల అవస్థలు



గణపవరంలోని బాలికల హాస్టల్



బాత్‌రూమ్‌లకు తలుపులు ఊడిపోయిన దృశ్యం

గణపవరం, జూలై 30: ప్రభుత్వ వసతి గృహాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. గణపవరంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వసతి గృహంలో 12 గదులున్నాయి. 8 గదుల్లో వర్షం పేరడంతో నాలుగు గదుల మాత్రమే వినియోగిస్తున్నారు. విద్యార్థులకు మంచాలు లేక నేలపైనే నిద్రిస్తున్నారు. ఏడు మరుగుదొడ్లు,9 బాత్‌రూమ్‌లు ఉన్నప్పటికి ఉపయోగించలేకుండా తయారయ్యాయి. మరుగుదొడ్లకు తలుపులు లేకపోవడంతో సమీపంలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో ఉన్నవాటిని వాడుకుంటున్నారు. బాత్‌రూమ్‌లు కూడా నిరుపయోగంగా తయారయ్యాయి. ఒకప్పుడు వందల సంఖ్యలో విద్యార్థులు ఉన్న హాస్టల్ నేడు కాళీగానే తయారైంది. ప్రస్తుతం 35 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ప్రహరీ గేట్లు కూడా ధ్వంసమయ్యాయి. బిక్కుబిక్కుమంటూ రాత్రిళ్లు వస్తోందని విద్యార్థులు అంటున్నారు. కాస్మోటిక్ బిల్లులు కూడా ఆరు నెలల నుంచి ప్రభుత్వం చెల్లించడం లేదు.

ప్రతిపాదనలు పంపుతున్నాం

సూరమ్మ, వసతి గృహం వార్డెన్

వసతి గృహం శిథిలావస్థకు చేరిన మాట వాస్తవం. మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో మరుగుదొడ్లను వినియోగించుకుంటున్నారు. తాగునీరు కూడా బయట నుంచే తెప్పిస్తు న్నామన్నారు. మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నాం. స్పెషల్ ఆఫీసర్లు వచ్చి వెళ్తారు. అయితే నేటివరకు ఎటువంటి నిధులు మంజూరు కాలేదు.



పరిస్థితి వివరిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

రైతులకు పరిహారం అందిస్తాం

వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 30: ఎర్రకాలువ వరద ప్రభావంతో వరి పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం ఇస్తుందని వ్యవసాయ శాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలంలో ఎర్రకాలువ ముంపు ప్రభావంతో కుళ్లిపోయిన వరి పొలాలను పరిశీలించారు.ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కోరడంతో మంగళవారం ఆయన మండలంలోని నందమూరు, ఆరుళ్ల, జగన్నాధపురం, మాధవరం గ్రామాల్లో పంట నష్టపోయిన ప్రాంతాలను పరిశీలించారు. ఎర్రకాలువ వంతెన, కాలువ గట్టు గురించి ఎమ్మెల్యే వివరించారు. రాజశేఖర్ మాట్లాడుతూ పంట నష్టపోవడం వల్ల పెట్టుబడి తిరిగి చేసేందుకు రైతులకు పరిహారం ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. వాటితో పాటు ఎర్రకాలువ ముంపు నుంచి రైతులకు ఇబ్బంది లేకుండా గట్టు పటిష్టం చేయడంతో నివారణ చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు కూడా స్వల్పకాలిక వరి రకాలు వేయడం ద్వారా నష్ట నివారణ చేపట్టవచ్చన్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో పంట నష్టపోయిన రైతుల వివరాలు నమోదు చేస్తున్నామని అందరికీ పరిహారం అందించే చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులంతా ఈ పంట నష్ట నివేదికలు త్వరితగతిన సమర్పించాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎర్రకాలువ ముంపు ప్రాంత రైతులను ఆదుకు నేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. జిల్లా అధికారులు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తి సంఘాలను ఆదర్శంగా నిలపాలి :కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు (ఆంధ్రజ్యోతి), జూలై 30 : జిల్లాలోని రైతు ఉత్పత్తిదారుల సంఘాలను దేశానికే ఆదర్శంగా నిలపాలని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నాబార్డ్ ఆధ్వర్యంలో మంగళవారం రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పీవో) ఏర్పాట్లపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ ఉత్పత్తులకు రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా అధిక రాబడి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో కోకో పంట ఎక్కువగా ఉంటుందని, వాటితో రైతుల ద్వారా ఊటీ, కొడైకెనాల్ వంటి ప్రాంతాల్లో మహిళలు ఇంట్లోనే ఎక్కువగా తయారుచేసే, ప్రాచుర్యం కలిగిన హోమ్‌మేడ్ చాక్లెట్లను తయారు చేసేందుకు ఏలూరు జిల్లాలో కూడా ప్రోత్సహించాలి. నూజివీడు మామిడి రసాలు దేశవ్యాప్తంగా బ్రాండ్ కలిగి ఉన్నాయని వాటికి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. సంఘంలో కనీసం 300 మంది సభ్యులు ఉండాలని, జిల్లాలో ప్రస్తుతం 17 రైతు ఉత్పత్తిదారుల సంఘాలు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నాయని సంఘాలకు రాయితీతో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించడంతో పాటు వ్యవసాయ పరికరాల యంత్రాలు కూడా అందిస్తామన్నారు. రైతుల్లో అవగాహన కల్పించి పెద్దఎత్తున రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. నాబార్డ్ డీడీఎం అనిల్‌కాంత్, వ్యవసాయశాఖ జేడీ ఎస్కే. హబీబ్ బాషా, డీఎస్ఓ అబ్రహం, అసిస్టెంట్ ఎల్డీఎం చంద్రశేఖర్, ఉద్యానశాఖ డీడీ రామ్మోహన్ పాల్గొన్నారు.



కొయ్యలగూడెంలో ఆందోళన చేస్తున్న మొక్కజొన్న రైతులు

మొక్కజొన్న రైతుల ఆందోళన

కొయ్యలగూడెం, జూలై 30:కొనుగోలు చేసిన మొక్కజొన్న పంటకు దళారి డబ్బులు ఇవ్వడం లేదంటూ రైతులు కొయ్యలగూడెంలో ఒక గోడౌన్ దగ్గర ఆందోళన నిర్వహించారు. పోలవరం మండలం గూటాల గ్రామానికి చెందిన మొక్కజొన్న రైతులు ఒక దళారికి మొక్కజొన్న పంట అమ్మారు. అయితే ఆ దళారి డబ్బులు ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. ఆ మొక్కజొన్న పంటను మరో దళారికి అమ్మేశాడు. అయితే ఆ పంటను కొయ్యలగూడెం గొడౌన్‌లో ఉంచారని తెలుసుకున్న రైతులు గోడౌన్ వద్దకు వచ్చి ఆందోళనకు దిగారు. వేరే దళారి దగ్గర మేము కొనుగోలు చేశామని అతనికి డబ్బులు చెల్లించేశామని వారు చెబుతున్నారు. దీంతో రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు పారేపల్లి నరేష్ మద్దతు తెలిపి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే కారుపై దాడి అవాస్తవం

డీఎస్పీ సురేష్ కుమార్ రెడ్డి




విలేకరులకు వివరాలు తెలుపుతున్న డీఎస్పీ

జీలుగుమిల్లి, జూలై 30 : పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కారుపై సోమవారం జరిగిన దాడి విషయమై పోలీసు నిఘా వర్గాలు ఆరా తీశాయి. పోలవరం డీఎస్పీ ఆధ్వర్యంలో సీఐ క్రాంతికుమార్ పలువురు ఎస్సైలు విచారణ జరిపారు. ఎమ్మెల్యే కారుపై దాడి జరిగిందనే వార్తలు, కథనాల్లో వాస్తవం లేదని డీఎస్పీ సురేష్‌కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. ఎమ్మెల్యే ఇంటి వద్ద కారు నిలిపి గిరిజన పనులు జరుగుతున్న సమయంలో ఒక స్తంభం వచ్చి కారు అద్దం మీద పడడంతో కొంత డ్యామేజ్ అయ్యింది. సోమవారం ఎమ్మెల్యే మరో కారులో పర్యటించారు. సాయంత్రం ఎమ్మెల్యే పీఏ, మరో ఇద్దరు ఎమ్మెల్యే ఆఫీసుకు ఉన్న కారులో బయలుదేరి వెళ్లుండగా బర్రింకలపాడు వద్దకు వచ్చేసరికి రోడ్డు టర్నింగ్ వద్ద కుడుపు నకు కారు వెనుక అద్దాలు ఒక్కసారిగా ముక్కలయ్యాయి. దీంతో కారులో ఉన్నవారు ఎవరో తమపై దాడి చేశారని భావించారని తెలిపారు. ఈ విషయం అలస్యంగా వెలుగులోకి వచ్చింది. తమకు శత్రువులెవరూ లేరని నియోజకవర్గ ప్రజల ఆదరాభిమానాలతో ఉన్నామని ఎమ్మెల్యే బాలరాజు తెలిపారు. ఈ ఘటనపై వివరణకు జిల్లా అధికారుల ఆదేశాల మేరకు క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్, ఎస్‌బీ, ఇంటెలిజెన్స్ బృందాలు, ఎస్సైలు చంద్రశేఖర్, వెంకన్న, విష్ణువర్ధన్, దుర్గామహేశ్వరరావు, సాదిక్ పాల్గొన్నారు.

నరసాపురం వ్యాపారిపై నెల్లూరులో ఫిర్యాదు

నెల్లూరు(క్రైం), జూలై 30: పదవపెట్టిన బంగారు ఆభరణాలు నకిలీవంటూ వ్యాపారి తమను మోసం చేశాడంటూ మహిళలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నెల్లూరులోని వేదాయపాళెం పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు, బాధితుల సమాచారం మేరకు పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం మండలం సరిపల్లి గ్రామానికి చెందిన ఉషారాణి తన ఇద్దరు పిల్లలు, తల్లి భవానీతో కలిసి నెల్లూరు నగరంలోని పడారుపల్లిలో నివాసం ఉంటున్నారు. తన తాలూకు 141.54 సవర్ల బంగారు ఆభరణాలను తమకు బాగా తెలిసిన నర్సాపురం లోని ఓ బంగారు వ్యాపారి దుకాణంలో తాకట్టుపెట్టి రూ.47.40 లక్షలు తీసుకున్నారు. ప్రతి నెల వడ్డీ చెల్లిస్తున్నారు. జీవీఎల ఉషారాణి, భవానీ నర్సాపురం వెళ్లి తమకు నగదు అవసరమని తాకట్టులోని బంగారు ఆభరణాలను విక్రయించి మిగిలినది నగదు ఇవ్వాలని వ్యాపారిని కోరారు. తాకట్టులో ఉన్న ఆభరణాలు నకిలీవని, మీరే నగదు చెల్లించాలని వ్యాపారి చెప్పడంతో బాధితులు రెండు రోజుల కిందట వేదాయపాళెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన జరిగిన ప్రదేశం నరసాపురం కావడంతో తదుపరి విచారణ నిమిత్తం కేసును అక్కడి స్టేషన్‌కు బదిలీ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అక్రమంగా కేసు నమోదు చేశారు..



నెల్లూరులో మాట్లాడుతున్న బాధితు హ్యూమన్ రైట్స్ కమిషన్ రాష్ట్ర కార్యదర్శి

ఉషారాణిపై నర్సాపురం టౌన్ పోలీసులు అక్రమంగా కేసు నమోదు చేశారని నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ రాష్ట్ర కార్యదర్శి కనుపూరు శ్రీని వాసులు ఆరోపించారు. మంగళవారం నెల్లూరు ప్రెస్ క్లబ్‌లో ఆయన బాధితులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తాము కుదువ పెట్టిన బంగారాన్ని విక్రయించి అప్పు మొత్తం పోగా మిగిలిన నగదు ఇవ్వాలని ఉషారాణి, ఆమె తల్లి భవానీ వ్యాపారిని కోరారని అయితే ఆ వడ్డీ వ్యాపారి తన వద్ద గొల్ల నగలు కుదువ పెట్టి మోసం చేశారంటూ తల్లీ కూతుళ్లను బూతులు తిట్టి చంపేస్తామని బెదిరించాడని ఆరోపించారు. దీంతో వారు ప్రాణభయంతో నెల్లూరుకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. నరసాపురం పోలీసులు వ్యాపారి దుకాణంలోని సీసీ కెమెరాలు పరిశీలించకుండా, స్టాకు రికార్డులు పరిశీలించకుండా ఏకపక్షంగా కేసు నమోదు చేశారని విమర్శించారు. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం, మానవ హక్కులసంఘం జాతీయ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళుతున్నామని తెలిపారు.

క్రైం కార్నర్

పంట బోదెలో పడి ఒకరి మృతి

భీమవరం క్రైం, జూలై 30 : తన ఇంటి సమీపంలోని పంట బోదెలో ఒక వ్యక్తి పడి మృతి చెందినట్లు టూటౌన్ ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. 39వ వార్డు దుర్గాపురానికి చెందిన కూతాడ శ్రీనుకు (40) ఫిట్స్ వ్యాధి ఉంది. ఈనెల 29వ తేదీన పక్కనే ఉన్న తన తల్లి ఇంటికి టీవీ చూడడానికి అని వెళ్లాడు. సాయంత్రం అయినా శ్రీను ఇంటికి రాకపోవడంతో భార్య బంధువులు అన్ని చోట్ల వెతికారు. ఇంటి సమీపంలోని పంట బోదెలో శ్రీను మృతదేహం మంగళవారం కనిపించింది. దీనిపై మృతుని భార్య గంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ ఢీకొని వృద్ధుడి మృతి

పాలకోడేరు, జూలై 30: బైక్ ఢీకొన్న ప్రమాదంలో చికిత్స పొందుతూ పాలకోడేరు గ్రామానికి చెందిన గుంటుబోయిన అప్పలనాయుడు (58) సోమవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాస రావు మంగళవారం తెలిపారు. పాలకోడేరు గ్రామానికి చెందిన రైతు కూలి అయిన అప్పలనాయుడు మోగల్లు నుంచి పాలకోడేరు వస్తుండగా బైక్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం శవ పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో బాలుడి దుర్మరణం

జంగారెడ్డిగూడెం, జూలై 30: కరెంట్ షాక్‌తో పట్టణంలో ఓ ఇంటిపైన ఆడుకుంటున్న బాలుడు వెదుళ్ల నరేష్ (12) మంగళవారం రాత్రి మృతి చెందాడు. స్థానిక రామచంద్రాపురంలో వెదుళ్ల నాగేశ్వరరావు, శ్యామల దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు మగ పిల్లలు. పెద్ద కుమారుడు ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతుండగా చిన్న కుమారుడు నరేష్ ఆరో తరగతి చదువుతున్నాడు. శ్యామల ఓ ఇంటి వద్ద పని చేస్తున్నది. రోజూ ఇంటి నుంచి పనికి వెళ్లాయింటే అలస్యం, దూరం అవుతోందని ఆమె పనిచేసే యజమాని ఇంటి దగ్గరగా ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. మంగళవారం రాత్రి శ్యామల పనిచేసే యజమాని ఇంటి వద్ద పుట్టినరోజు వేడుక జరుగుతుండగా శ్యామల కుమారుడు నరేష్ కూడా తల్లితో వెళ్లాడు. తల్లి పనిలో ఉండగా నరేష్ భవనం పైన ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ తీగలు తగిలి కరెంట్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే బాలుడిని దగ్గరగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. విద్యుత్ శాఖ అధికారులు తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరించారు.

స్కూటీ మాయం..ఫిర్యాదు

భీమవరం క్రైం, జూలై 30 : భీమవరం పట్టణంలోని జువ్వలపాలెం రోడ్డులో భీమవరం ఆసుపత్రి వద్ద తన స్కూటీ పోయిందని బాధితుడు ఫిర్యాదు చేసినట్లు టూటౌన్ ఎస్ఐ రమేష్ తెలిపారు. భీమవరం మండలం చిన అమిరం గ్రామానికి చెందిన కలిశెట్టి తాతారావు స్కూటీ గత నెల 15వ తేదీన మాయమైందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.



పోలీస్‌స్టేషన్ వద్ద నినాదాలు చేస్తున్న సంస్థ సభ్యులు

గోవులను రక్షించాలి

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 30: గోవులను వధించి కబేళాలను నియమాలకు తరలిస్తున్న వ్యక్తులను అడ్డుకుని వారిని దర్యాప్తు సంస్థ సభ్యులు మంగళవారం పోలీసులకు అప్పగించారు. గోవధ నిషేధం అయినా కొందరు ఇష్టారీతిన గోవులను వధించి కబేళాలకు తరలించడం దారుణమని ధర్మసంస్థాపన సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గోవులను రక్షించాలంటూ నినాదాలు చేశారు.

జనన,మరణ నమోదుకు ఇబ్బందులు

రెండు నెలలుగా యాప్ పనిచేయడం లేదంటున్న సిబ్బంది

పాలకొల్లు, జూలై 30 :మున్సిపల్ కార్యాలయంలో ఉన్న జనన మరణ రిజిస్ట్రేషన్ కార్యాలయం రెండు నెలలుగా పనిచేయకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. జననమరణ నమోదు యాప్ పనిచేయక పోవడమే ఇందుకు కారణం అని కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు. రాష్ట్రం అంతా ఇదే పరిస్థితి నెలకొందని సిబ్బంది చెబుతున్నారు. అయితే యాప్ పనిచేయకుంటే వేరే విధంగా సర్టిఫికెట్లు జారీ చేయాలి. లేకుంటే విద్యార్థులు, జీవిత మరణించిన వారి వారసులు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోం దని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విదేశాలకు వెళ్లే విద్యార్థులు రెండు నెలలుగా సర్టిఫికెట్లు రాకపోవడంతో తమ భవిష్యత్ ప్రశ్నార్థకం అని వాపోతున్నారు. సంబంధిత అధికారులు త్వరిత గతిన యాప్‌ను పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.

దూరవిద్య టెన్త్, ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, జూలై 30 : ఏపీ సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్య టెన్త్, ఇంటర్మీడియట్‌లలో 2024-25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుం లేకుండా నిర్దిష్ట ఫీజు చెల్లించి ఈనెల 31 నుంచి ఆగస్టు 27వరకు, అపరాధ రుసుం రూ.200 కలిపి 28 నుంచి సెప్టెంబరు 4 వరకు అడ్మిషన్ల గడువు ఉందని వివరించారు. ఏపీ ఓపెన్‌స్కూల్.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్ లేదా ఏపీ ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రవేశాలు పొందవచ్చునని తెలిపారు.

కృష్ణా డెల్టాకు సాగు నీరు విడుదల

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఏలూరు రూరల్, జూలై 30: ఇటీవల పాలగూడెం గ్రామంలో సుమారు 300 ఎకరాల్లో నీరు అందక బీటలు వారిన మడులకు సంబంధించి ఆంధ్రజ్యోతిలో ఈనెల 28న ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. మంగళవారం కృష్ణాడెల్టా పరిధిలో సాగుభూములకు పట్టిసీమ ఎత్తిపోతల కాలువ నుంచి సాగునీరును విడుదల చేశారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సాగుభూములకు నీరు విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మల్కాపురంలోని పంట కాల్వను రైతుసంఘం నాయకులు పరిశీలించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గం పరిధిలోని కృష్ణా, గోదావరి డెల్టాల ఆయకట్టు శివారు ప్రాంతంగా ఉందన్నారు. నారు ఎదిగినా నాట్లు వేయటానికి సాగునీరు లేక ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ క్రమంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, అధికారులు స్పందించి సాగునీరు మళ్లించి అన్నదాతలను ఆదుకోవడంతో కృతజ్ఞతలు తెలిపారు. పంట కాల్వలో గుర్రపుడెక్క, తూడుతో నిండిపోయిందని సక్రమంగా నీరు పారుదలకు పంట కాల్వలను బాగు చేయాలని విజ్ఞప్తి చేశారు.



నీటి విడుదలను పరిశీలిస్తున్న రైతు సంఘ నాయకులు

ఎస్పీని కలసిన ఎమ్మెల్యే బడేటి చంటి

ఏలూరు క్రైం/ఏలూరు టూటౌన్, జూలై 30 : జిల్లా ఎస్పీ కె.ప్రతాప్‌శివకిషోర్‌ను ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ కలిసి నియోజకవర్గ శాంతి భద్రతలపై చర్చించారు.



అభివృద్ధిలో అగ్రభాగాన నిలుస్తాం..

ఏలూరు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రభాగన నిలబెట్టడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. బడేటి క్యాంపు కార్యాలయంలో మంగళవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్ళుగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. వర్షాకాలం దృష్ట్యా ప్రజలు అనారోగ్యాల పాలు కాకుండా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కో-అప్షన్ సభ్యులు పెదబాబు, ఎంఈ కొండలరావు, ఏఈలు శేషగిరిరావు, సాయి, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎంపీ పుట్టా

ఏలూరుటూటౌన్, జూలై 30: ప్రజాసమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యమని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అన్నారు. మంగళవారం కొయ్యలగూడెం మండలం గవరవరం శివారు వెంకాయపాలెంలో పాడైన రోడ్లు, డ్రెయిన్ల మరమ్మతులు చేయాలని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ ఎస్ఈకి లేఖరాశారు. కామవరపుకోట మండలం కళ్ళచెరువు, రంగాపురం మధ్యన శిథిలమైన వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నూజివీడు, చింతలపూడి మీదుగా ద్వారకాతిరుమల చేరుకోవడానికి వంతెన మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు.

సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలి : సీఐ

ఏలూరు క్రైం, జూలై 30:ఆధునిక ప్రపంచంలో ప్రతి ఒక్కరి చేతిలో ఆండ్రాయిడ్ ఫోన్ ఉండడంతో సోషల్ మీడియాలో విద్యార్థులు చాలా ఉత్సాహంగా పాల్గొంటున్నారని దీనిని అవకాశంగా తీసుకున్న సైబర్ నేరగాళ్లు ఫోన్‌లో ఉన్న గోప్యమైన సమాచారాన్ని తస్కరిస్తున్నారని వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ విశ్వం అన్నారు. మంగళవారం ఏలూరు కోటదిబ్బ వద్ద ఉన్న గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్ అధికారులమంటూ ఫోన్లు చేసి బ్యాంక్ అకౌంట్లో సొమ్ములను తస్కరిస్తున్నారని ఎవరికి ఎట్టి పరిస్థితిలోనూ ఓటీపీ నంబరు చెప్పకూడదన్నారు. విద్యార్థులు ఇరవై ఏళ్ల పాటు కష్టపడి చదివితే మిగిలిన ఎనభై ఏళ్లు ఆనందంగా జీవించవచ్చని సూచించారు.

వరద బాధిత గ్రామాల్లో బీజేపీ నేతల పర్యటన

వేలేరుపాడు, జూలై 30 : కొద్దిరోజుల క్రితం పెదవాగు ప్రాజెక్టు వరదల వల్ల సర్వస్వం కోల్పోయిన మేడేపల్లి, కమ్మరగూడెం గ్రామాల్లో మంగళవారం బీజేపీ నాయకులు పర్యటించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్, బీజేపీ మహిళా మోర్చ అధ్యక్షురాలు బొల్లిన నిర్మలకిషోర్ బాధితులతో మాట్లాడుతూ నష్టపోయిన ప్రజలకు ప్రభుత్వం నుంచి అందిన సహాయంపై ఆరా తీశారు. బీజేపీ నాయకులు జట్ల రాంబాబు, ప్రసాద్, కట్టా సత్యనారాయణ, ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ కృష్ణప్రసాద్, కాంచన మాల, నరసింహారావు, జనసేన అధ్యక్షులు ఆదినారాయణ, క్రాంతికుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి : చింతమనేని

పెదవేగి, జూలై 30 :సాధారణ కార్యదర్శి స్థాయినుంచి డ్రాయింగ్ పవర్ అందుకున్న మీరంతా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని గ్రేడ్ -5 కార్యదర్శులకు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు. సచివాలయాల్లో నాలుగేళ్ళుగా పనిచేస్తున్న గ్రేడ్-5 కార్యదర్శులు కొద్దిరోజుల కిందట వృత్తిపరంగా ఎదురవుతున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్ళగా పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా కల్పించారు. తాజాగా ప్రభుత్వం పంచాయతీ బాధ్యతలతో డ్రాయింగ్ పవర్ ఇవ్వడంతో గ్రేడ్-5 కార్యదర్శులు ఎమ్మెల్యే ప్రభాకర్‌ను మంగళ వారం కలిసి, మిఠాయిలు పంచి, ఆనందాన్ని పంచుకున్నారు. టీడీపీ పెదవేగి మండల అధ్యక్షుడు బొప్పన సుధాకర్, కార్యదర్శులు హేమంత్‌కుమార్, పవన్‌కుమార్, సౌజన్య, చంద్రశేఖర్, శైలజ, సలోమీ, విజయ, రాజేష్, ఎలిజబెత్ రాణి, సంధ్యారాణి, నవ్యాని, దినేష్‌కుమార్, విష్ణుప్రియ, సురేష్, అబ్దుల్ రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి పది రోజుల జైలు

ఏలూరు క్రైం, జూలై 30:మద్యం తాగి మోటారుసైకిల్ నడిపినట్టు ఒక వ్యక్తిపై నేరం రుజువు కావడంతో అతడికి పది రోజుల జైలు శిక్ష విధిస్తూ కోర్టు మంగళవారం తీర్పు చెప్పింది. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి గ్రామానికి చెందిన తుంపాల రాంబాబు ఈనెల 28న మద్యం తాగి వాహనం నడుపుతుండగా ఏలూరులో ఎస్ఐ కె.రాజారెడ్డి తనిఖీలు చేసి కేసు నమోదు చేశారు. మంగళవారం అతడిని కోర్టులో హాజరుపరచగా పదిరోజుల జైలు శిక్ష విధించారు.

అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి

ఏలూరు క్రైం/బుట్టాయగూడెం, జూలై 30 : జిల్లా ఆర్మ్డు రిజర్వు విభాగం హెడ్‌కానిస్టేబుల్ తెల్లం చంద్రరావు అనారోగ్యంతో మంగళవారం ఉదయం ఏలూరు హనుమాన్‌నగర్‌లో ఆయన నివాసంలో మృతి చెందారు. ఎస్పీ ఆదేశాలతో ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ ఎస్ఎస్ శేఖర్, ఏఆర్ డీఎస్పీ శ్రీహరిరావు, ఆర్ఐ భావనకుమార్, ప్లాటూన్ ఆర్ఎస్ఐ శంకర్, పోలీస్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్.రమేష్‌కుమార్, పోలీసు అధికారుల సంఘ అధ్యక్షుడు ఆర్.నాగేశ్వరరావు వెళ్ళి చంద్రరావు మృత దేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించి, రూ.25 వేల నగదును అందించారు. విడో ఫండ్‌గా 50 వేల రూపాయలు చెక్కు, ఫ్లాగ్ ఫండ్‌గా 25 వేల రూపాయల చెక్కును అందించారు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. అనంతరం స్వగ్రామం బుట్టాయగూడెం మండలం అచ్చియ్యపాలెంలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం..

- ఉంగుటూరు, జూలై 30 : మండలంలోని సాయి భక్తులు మంగళవారం ఉంగుటూరులోని పురవీధుల్లో సాయి నామాన్ని జపించారు. రామాలయంలో ప్రత్యేక పూజలు, నగర సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు.
- పోలవరం : పోలవరం తహసీల్దార్ జీవీ ప్రసాద్ మంగళవారం బదిలీపై కాకినాడ తరలి వెళ్ళారు. ప్రస్తుతం డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రసాద్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు.
- ఏలూరు రూరల్ : పత్తికోళ్ళలంక గ్రామ సర్పంచ్ ఘంటసాల మహాలక్ష్మిరాజు.. జిల్లా పంచాయతీ అధికారిని కలిసి తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. వ్యక్తిగత కారణాల రీత్యా పదవికి రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు.
- జీలుగుమిల్లి : జీలుగుమిల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం జంగారెడ్డిగూడెం ఆర్డీవో కె.అద్దయ్య సందర్శించి, వీఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. నిర్వాసిత గ్రామాల్లో భూముల సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు.
- పోలవరం : పోలవరం నుండి కన్నాపురం వెళ్ళే రోడ్డు మార్గంలో సిమెంట్ లోడు లారీ రోడ్డు మార్జిన్‌లో దిగబడి రోడ్డుకి అడ్డంగా నిలిచిపోవడంతో గంటసేపు ట్రాఫిక్‌జామ్ అయింది. వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.
- నిడమర్రు: భువ్వనపల్లిలో జరిగిన వినియోగదారుల హక్కుల సమావేశంలో వైస్ చైర్మన్ శ్రీనివాసరావు, సంకు నాగేశు చేతుల మీదుగా గణపవరం టౌన్ ఇన్‌చార్జిగా కొత్యాల కార్తీక్‌ను ఎంపిక చేసి నియామకపత్రం అందజేశారు.
- లింగపాలెం వాహనదారులు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని, బైక్‌పై వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించాలని ధర్మాజీగూడెంలో వాహనదారులకు ఎస్ఐ పి.చెన్నారావు సూచించారు.

హెచ్‌ఎం రుచి చూశాకే పిల్లలకు పెట్టాలి

» జేసీ ధాత్రిరెడ్డి ఆదేశం

ఏలూరు అర్బన్, జూలై 30 : పాఠశాలల్లో బాలబాలికలకు వడ్డిస్తోన్న మధ్యాహ్న భోజన పథకం ఆహార పదార్థాల నాణ్యతను స్కూలు హెచ్‌ఎం రుచి చూసినతర్వాతే పిల్లలకు అందించాలని జేసీ ధాత్రిరెడ్డి ఆదేశించారు. మంగళవారం నగరంలోని సుబ్బమ్మదేవి మున్సిపల్ స్కూలులో భోజన పథకం అమలు తీరు, అమీనాపేట-1 సోషల్ వెల్ఫేర్ బాలికల వసతిగృహం స్టాక్ పాయింట్, వంట గదిని, ద్వారకానగర్, తంగెళ్ళమూడి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిర్దేశిత ఆహారపట్టిక ప్రకారం పోషక విలువలతో కూడిన ఆహారాన్ని పెట్టాలని సూచించారు. కోడిగుడ్డు, ఫోర్టిఫైడ్ బియ్యం తదితర నిత్యావసర సరుకుల భద్రత విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల హాజరు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలిం చారు. ఐసీడీఎస్ పీడీ పద్మావతి, బీసీ, సోషల్ వెల్ఫేర్ జేడీలు నాగమణి, జయప్రకాష్, పౌరసరఫరాల సంస్థ డీఎం మంజుభార్గవి, డీఎస్‌వో రాజు, డీవైఈవో రవిప్రకాష్, డీఈవో కార్యాలయ ఏడీ-2 షరీఫ్, ఎంఈవో రంగయ్య, ఫుడ్‌సేఫ్టీ అధికారి రామరాజు తదితరులు పాల్గొన్నారు.



సుబ్బమ్మదేవి మునిసిపల్ స్కూలులో పిల్లలతో కలసి భోజనం చేస్తున్న జేసీ

మానవ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు క్రైం, జూలై 30 : సమాజంలో మానవ అక్రమ రవాణా సర్వసాధారణమైందని, బాలలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏలూరు విద్యానగర్‌లో ఉన్న సెయింట్ గ్జేవియర్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు ఎదురైనప్పుడు వారితో జాగ్రత్తగా ప్రవర్తించాలని సూచించారు. సంఘ విద్రోహ శక్తులు బాలలను అపహరించడమే కాకుండా వారితో సంఘ విద్రోహ పనులు, వెట్టిచాకిరీ మొదలైన పనులు చేయిస్తున్నారని తెలిపారు. ఇటువంటి పరిస్థితులు ఎదురైనప్పుడు టోల్ ఫ్రీనెంబర్ 1098కు గాని, జిల్లా న్యాయసేవ సంస్థకు కాని సమాచారం అందించాలన్నారు. ప్యానల్ న్యాయవాది కూన కృష్ణారావు, ట్రైనీ మాస్టర్ తిగిరిపల్లి సుబ్బారావు, సోషల్ వర్కర్ ఎం అజయ్‌బాబు, ఉపాఠశాల ఉన్నత ఉపాధ్యాయులు ఐ.రాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు పిల్లలకు అవగాహన కల్పించాలి

కొయ్యలగూడెం, జూలై 30 : తల్లిదండ్రులు పిల్లలకు అవగాహన కల్పించాలని బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వి.రాజు కోరారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ హాలులో న్యాయవిజ్ఞన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాలో ఎక్కువగా పిల్లలు నష్టపోతున్నారన్నారు. అంగన్వాడీ టీచర్లు ఇటువంటి సంఘటనల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. న్యాయవాదులు మేకల రామ్మోహన్, బంగారు లతాకుమారి, పిల్లి పెద్దిరాజు, బొడ్డు వాసు, గౌతమి, స్వర్ణకుమారి, అంగన్వాడీ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



ఏలూరు సదస్సులో మాట్లాడుతున్న జడ్జి రత్నప్రసాద్

మానవ అక్రమ రవాణా నియంత్రణ అందరి బాధ్యత..

చింతలపూడి, జూలై 30:మానవ అక్రమరవాణా అరికట్టడానికి సమాజంలోని ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ న్యాయాధికారి సి.మధుబాబు అన్నారు. ప్రైవేట్ కళాశాలలో మానవ అక్రమ రవాణా వ్యతిరేక ప్రపంచ దినోత్సవం సందర్భంగా కోర్టు ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాలికలకు చట్టాలపై అవగాహన ఉండాలని, స్వీయరక్షణ, పలుచట్టాలపై అవగాహన కల్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బలుసు నాగేశ్వరరావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్, పీపీ సామయ్య, సోషల్ వర్కర్ అక్బర్‌అలీ, న్యాయవాదులు డేవిడ్‌రాజు, భవాని తదితరులు పాల్గొన్నారు.

సజావుగా మండల పరిషత్ సమావేశం

ఏలూరు రూరల్, జూలై 30: ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో బండి ప్రణవి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అధ్యక్షతన జరిగింది. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనులపై చర్చించారు. తొలుత పలు శాఖల పనితీరుపై సమావేశంలో చర్చించారు. ఏలూరు ఎంపీడీవో బండి ప్రణవి మాట్లాడుతూ మండలంలో కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు ఇండియన్ మ్యాప్‌లో సైతం ప్రదేశాలను గుర్తుపట్టలేకపోతున్నారన్నారు. విద్యార్థుల హాజరుశాతం కూడా తక్కువ అవుతుందని గుడివాడలంక ఉపసర్పంచ్ అన్నారు. డిప్యూటీ తహసీల్దార్ నాగమణి మాట్లాడుతూ మండలంలో 24 లేఅవుట్లు వేశామన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ శ్రీకాంత్ మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ డ్రెయిన్‌లు, అంగన్‌వాడీ పాఠశాల నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. తాగునీటికి బోరు సదుపాయం ఏర్పాటు చేశామన్నారు. జాలిపూడి ఎంపీటీసీ తంబీ మాట్లాడుతూ సీసీ డ్రెయిన్‌ల నిర్మాణం సగంలో నిలిపివేయడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఆర్‌డీఈ లీలాకుమారి మాట్లాడుతూ జిల్లా పరిషత్ నిధుల ద్వారా 15 పనులు, రూర్బన్ నిధుల ద్వారా సీసీ రోడ్లు 52కు గాను 48 పూర్తయ్యాయన్నారు. రూ.10లక్షల ఎంపీ లాడ్స్‌తో అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. గుడివాకలంక వెళ్ళేరోడ్డు వర్షానికి పూర్తిగా పాడైపోయిందని సభ్యులు ఆరోపించగా, కొకిరాయిలంక, మాదేపల్లి, జాలిపూడి, కె.డిపురంలో ప్యాచ్‌వర్క్‌లను రూ.60లక్షలతో పనులు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. అనంతరం మత్స్యశాఖ అధికారి, డ్రైన్స్ ఏఈ రాజశేఖర్ మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించటానికి జరిగిన సమావేశంలో ప్రజాప్రతినిధులు నోరుమెదపకపోవడం గమనార్హం. జడ్పీటీసీ మండల సరస్వతి, పలువురు సర్పంచ్‌లు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏలూరు ఎంపీపీ శ్రీనివాసరాజు

దోమల నిర్మూలనకు చర్యలు : ఎంహెచ్‌వో

ఏలూరుటూటౌన్/టి.నరసాపురం/జంగారెడ్డిగూడెం, జూలై 30 :దోమల నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎంహెచ్‌వో డాక్టర్ మాలతి తెలిపారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా పదో డివిజన్ అగ్రహారం, పాత కల్పనా థియేటర్ రోడ్డు, హాయ్ టీ సెంటర్, రోడ్డు ప్రాంతాల్లో దోమల నిర్మూలనకు స్ప్రేయింగ్, ఫాగింగ్, నిల్వనీటిలో ఆయిల్ బాల్స్ వేసినట్టు ఆమె తెలిపారు. మలేరియా ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌స్వామి, సూపర్‌వైజర్ దుర్గారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు పాల్గొన్నారు. టి.నరసాపురం మండలం పుట్రేల గ్రామంలో పంచాయతీ కార్యదర్శి జి.లక్ష్మీనారాయణ, సర్పంచ్ మోదుగు సునంద ఆధ్వర్యంలో దోమల మందు స్ప్రేయింగ్ చేశారు. జంగారెడ్డిగూడెం మండలం రాచన్నగూడెం పీహెచ్‌సీ పరిధిలోని తాటిరామన్నగూడెంలో వైద్యాధికారి దివ్య ఆధ్వర్యంలో స్ప్రేయింగ్ చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ ఎవరికైనా జ్వరాలు వచ్చి ఒకటి రెండు రోజుల్లో తగ్గకపోతే పీహెచ్‌సీలో పరీక్షలు చేయించుకోవాల న్నారు. ఐటీడీఏ మలేరియా అధికారి పెద్దిరాజు, ఎంపీహెచ్‌వో మహారాజు, ఏఎన్ఎం కృష్ణవేణి, సిబ్బంది రవీంద్ర, లక్ష్మీనరసమ్మ, నాగమణి ఉన్నారు.

పుంత ఆక్రమణ తొలగింపు

జంగారెడ్డిగూడెం, జూలై 30 : వేగవరం గ్రామం లోని ప్రభుత్వ పుంత దారిని ఆక్రమించి కొబ్బరి, నిమ్మ మొక్క లు వేసి రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్న వ్యక్తిపై సమీప రైతు పల్లంట్ల నారాయణ స్వామి కోర్టులో కేసు వేయడంతో ఆక్రమణలు తొలగించారు. హైకోర్టు నాయమూర్తి ఆదేశాలతో తూంపాటి రాంబాబును ఆక్రమణ తొలగిం చాలని ఈనెల 27న రెవెన్యూ అధికారులతో నోటీసు అందచేసినా ఆక్రమణలు తొలగించకపోవడంతో మంగళవారం తహసీల్దార్ కె.స్లీవజోజి, ఎంపీడీవో కేవీ ప్రసాద్, ఎస్ఐ జ్యోతిబసు, సర్పంచ్, ఎంపీటీసీ, మండల సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది సమక్షంలో ఆక్రమణలు తొలగించి పుంత దారిని వేగవరం గ్రామ పంచాయతీ కార్యదర్శికు అప్పగించినట్లు తహసీల్దార్ తెలిపారు.



ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం చేయాలి

ఏలూరు అర్బన్, జూలై 30 :రాష్ట్రంలో రిజర్వేషన్ల అమలుపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఆగస్టు రెండో తేదీన నిర్వహించే మంత్రి మండలి సమావేశంలో అన్ని సామాజికవర్గాల వారికి సమన్యాయం చేసి, సమాన అవకాశాలు కల్పించాలని సోషల్ జస్టిస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ రావి శ్రీనివాస్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సార్వజనీన కులాలవారందరికీ విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాల్లో సమన్యాయం, సామాజిక న్యాయం చేయాలంటూ ఇప్పటికే గవర్నర్, మంత్రులు, శాసనసభ్యులందరికీ రిజిస్టర్ పోస్టులో వినతిపత్రాలను పంపించినట్లు వివరించారు.

విద్యుత్ వైర్ల చోరీ.. కేసు నమోదు

ఉంగుటూరు, జూలై 30 : మండలంలోని నల్లమాడు రెవెన్యూ పరిధిలో మోటార్ల వద్ద విద్యుత్ వైర్ల చోరీతో పాటు స్టార్టర్లు సంబంధిత పరికరాల దొంగతనం జరిగింది. కొద్ది రోజులుగా జరుగుతున్న ఈ చోరీలపై సంబంధిత రైతులు ఆవేదన చెందుతన్నారు. మంగళవారం ఆరుగురు రైతులు చేబ్రోలు పోలీసులకు రైతులు ఆచంట చిన్నారి, బిక్కిన నాగేశ్వరరావు, మండ పోతురాజు, సుంకవల్లి శ్రీరామవతారం, వడ్లమూడి సాయికృష్ణ ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నిడమర్రు జూలై 30 : నిడమర్రు గాదిరాజు గోపాలకృష్ణంరాజు ఉన్నత పాఠశాలలో 1985-86 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆహ్లాదకరంగా సాగింది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చిన్ననాటి మధుర స్మృతులు గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. విద్యనేర్పిన గురువులు జువ్వల రామ్మూర్తి, రుద్రరాజు రామకృష్ణంరాజు, వేగిరెడ్డి లక్ష్మణరావు, ఇంటి మరళీకృష్ణ, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, టి.కాశీ అన్నపూర్ణమ్మలను సన్మానించారు. పూర్వ విద్యార్థుల సంఘం కమిటీ సభ్యులు వగ్వాల సూర్యనారాయణ, గొట్టుముక్కల నరేంద్రవర్మ, చీమకుర్తి నాగబాబు, అత్తిలి పాండురంగా రావు, ఎస్.రంగారావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

ఉంగుటూరు, జూలై 30 : జూనియర్ కళాశాలల్లో ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కోరారు. మంగళవారం నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డి.వి.ఈ.వో.ప్రభాకరరావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బి.వి.శ్రీనివాస్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.కే.విశ్వేశ్వరరావు, మండల విద్యాశాఖాధికారి కాండ్రేగుల శ్రీనివాసరావు, సర్పంచ్ దిడ్ల అలకనంద, నాయకులు వేగెశ్న రంగరాజు, సాగిరాజు జానకీరామరాజు తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఇళ్ల స్థలాలపై కూటమి ప్రకటన హర్షణీయం

జంగారెడ్డిగూడెం, జూలై 30 : పేదల సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ సీనియర్ నాయకుడు పరిమి సత్యనారాయణ అన్నారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలు లేని పేదలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్టణంలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల స్థలాలతో పాటు ఇల్లు నిర్మాణానికి నాలుగు లక్షల రూపాయలు ప్రకటించి తీపి కబురు చెప్పడం పట్ల మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. గత వైసీపీ పాలనలో పట్టణంలో పేదలకు సెంటు, గ్రామీణులకు సెంటున్నర భూమి మాత్రమే ఇచ్చారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరు పెట్టడం అభినందనీయమన్నారు.

'ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం పొరాడుతాం'

ఏలూరుకార్పొరేషన్, జూలై 30:ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం పోరాడతామని సీఐటీయూ నాయకులు స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో ఆటో డ్రైవర్లు సమావేశమై ఎన్నికలు నిర్వహించారు. అడ్డాల రాజును అధ్యక్షుడిగాను, ప్రధాన కార్యదర్శిగా జె.గోపి, ఉపాధ్యక్షుడిగా చక్రాల అమరకుమార్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ-చలానాలు రద్దు చేయాలని, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అరవింద కాలేజీలో 'నన్నయ బృందం' పరిశీలన

ఉంగుటూరు, జూలై 30 :నారాయణపురం శ్రీ అరవిద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంకాం కోర్సును ప్రారంభించేందుకు అనువుగా ఉన్న విషయమై నన్నయ విశ్వ విద్యాలయం, రాజమహేంద్రవరం నుంచి అంగ్లం డిపార్ట్‌మెంట్ తరపున పి.అశోక్, డి.సి.ఎం.ఎస్ తరపున ఉదయ భాస్కర్ పరిశీలనకు వచ్చారు. ఈవిద్యా సంవత్సరం నుంచి కోర్సును ఉపయోగించుకుని ఉన్నత స్థానానికి చేరుకోవాలని ప్రిన్సిపాల్ టి.కే.విశ్వేశ్వరరావు. గణిత శాస్త్ర అధ్యాపకుడు పుట్టా బాబూరావు కోర్సు ప్రయోజనాలను వివరించారు.

ఘనంగా ఆడి కృత్తికా కావడి ఉత్సవం

ఏలూరు కార్పొరేషన్, జూలై 30 : దేవదాయ శాఖ ఆధ్వర్యంలో 20వ డివిజన్ పోస్టల్ కాలనీ లోని వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద మంగళవారం ఆడి కృత్తికా కావడి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆడి కృత్తికా నక్షత్రం సందర్భంగా ఆషాఢ బహుళ దశమి రోజున ఈ ఉత్సవాన్ని నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.




ఆవు కాలికి గాయం.. స్థానికుల సపర్యలు

జంగారెడ్డిగూడెం, జూలై 30 : స్థానిక అశ్వారావుపేట రోడ్డులోని ఓ హోటల్ వద్ద ఉన్న డ్రెయిన్‌లో రోడ్డుపై తిరిగే ఒక ఆవు కాలు చిక్కుకోవడంతో కాలి డెక్క వచ్చి గాయమై తీవ్ర రక్తస్రావమైంది. స్థానికులు పశువుల సంచార అంబులెన్సు 1962కు ఫోన్ చేయగా స్పందించకపోవడంతో ఆవు పడుతున్న బాధను చూసిన స్థానికులు కాలికి గుడ్డకట్టి సపర్యలు చేశారు. కొద్దిసేపటికి గోపాలమిత్ర వచ్చి వైద్యం అందించారు. అధికారులు స్పందించి రోడ్లపై పశువులు తిరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక అమ్మకాలపై ప్రత్యేక ప్రణాళిక

» విధుల్లోకి పలు మండలాల సిబ్బంది నియామకం

కుక్కునూరు, జూలై 30: కుక్కునూరు మండలంలోని వింజరం, ఇబ్రహీంపేట స్టాక్ పాయింట్లలో ఇసుక అక్రమ రవాణా జరిగిన విదితమే. దీనిని అరికట్టేందుకు అధికారులు ప్రత్యేకప్రణాళిక రూపొందించారు. జంగారెడ్డిగూడెం డివిజన్ లోని పలు మండలాలకు చెందిన అధికారులను ఇసుక స్టాక్ పాయింట్ వద్ద విధులు నిర్వహించేందుకు వారికి బాధ్యతలు అప్పగించారు ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు మళ్లీ మధ్యాహ్నం పన్నెండు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు అధికారులు విధులు నిర్వహించాలి. ఈ క్రమంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు మాత్రమే ఇసుక అమ్మకాలు జరపాలి. రాత్రి ఆరు గంటల నుంచి ఉదయం ఆరు గంటల వరకు ఇరువురి సిబ్బంది ఇసుక తరలి వెళ్లకుండా పహారా కాయాల్సి ఉంది. ఈమేరకు ఇసుక అక్రమ రవాణా చెక్‌పడనుంది. మంగళవారం ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారులు ఇబ్రహీంపేట ఇసుక



ఇబ్రహీంపేట ఇసుక స్టాక్ పాయింట్

వృద్ధ కళాకారులకు పెన్షన్లు పెంచాలి

ఏలూరు రూరల్, జూలై 30: గతంలో కళాకారులు చేసిన ప్రభుత్వ ప్రదర్శనల బకాయిలు విడుదల చేయాలని, వృద్ధ కళాకారుల పెన్షన్ పెంచాలని కళాకారుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దువ్వి రామారావు కోరారు. మంగళవారం రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను రాజమమహేంద్రవరంలో ఆయన నివాసంలో కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఏపీ సకల కళాకారుల సంక్షేమ సంఘం ఏలూరు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 200మంది యువ నాట్యాచార్యుల ఉద్యోగాలు తిరిగి పునరుద్ధరించాలని, జానపద భజనలు, కోలాటాలు, పగటివేషాలు వంటి ప్రతిరంగంలో వారిని కళాకారుడిగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి స్పందించి మంత్రివర్గంలో శాఖ అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారని రామారావు తెలిపారు. కళాకారుల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.



మంత్రి దుర్గేష్‌ను సత్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు రూరల్, జూలై 30: రెండు నెలలుగా రేషన్ డీలర్లకు రావాల్సిన కమీషన్ డబ్బులు నేటి వరకు చెల్లించలేదని, తక్షణం ఎస్‌సీఎం ఖాతాలో ఉన్న కమీషన్ డబ్బులు డీలర్ల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని, రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని ఏలూరు జిల్లా రేషన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజులపాటి గంగాధరగౌడ్ ప్రభుత్వానికి ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఆగస్టు నెల కోటాకు సంబంధించి పంచదార, కందిపప్పు గొడౌన్‌లో స్టాక్ లేకపోవడంతో టెండర్ల ప్రక్రియ మొదటి దశలోనే ఉందన్నారు. ఇంటింటికి ఎండీయూ ఆపరేటర్ల ద్వారా కార్డుదారులకు అందించిన తరువాత డబ్బు అందుకుంటామని, అసలు సరుకుల సరఫరా లేకపోతే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. రేషన్‌డీలర్లకు కమీషన్ ఏ విధంగా ఇస్తారని ప్రశ్నించారు. షాపుల అద్దె కట్టాలన్నారు. ప్రస్తుతం రేషన్‌డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలు రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి చొరవచూపి పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు.

ఐటీడీఏలో పెండింగ్ పనులు పూర్తిచేయాలి

బుట్టాయగూడెం, జూలై 30 : కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అన్నిరకాల పనులను వెంటనే పూర్తిచేయాలని ఎమ్మెల్యే చిర్రి బాలరా జు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐటీడీఏలో పలు శాఖలకు చెందిన అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించి పనులను పురోగతిని అడిగి తెలుసుకున్నారు. నిధులు ఉన్న పనులను పూర్తిచేయాలని మిగిలిన పనులకు సంబంధించిన నివేదికలు ఇవ్వాలని అధికారులను కోరారు. ఐటీడీఏకు వస్తున్న గిరిజనులను అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వస్తున్నాయని అధికారుల్లో మార్పు రావాలని చిత్తశుద్ధితో పనిచే యాలన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకువెళ్లి నిధుల విడుదలకు కృషి చేస్తానన్నారు. పీవో ఎం.శ్రీనుకుమార్, అధికారులు పాల్గొన్నారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు మంజూరు చేయాలి

బుట్టాయగూడెం, జూలై 30 : దళితుల, ఆదివాసీల ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడానికి ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు మంజూరుచేసి వెంటనే అమలు చేయాలని ఇఫ్టూ రాష్ట్ర కోశాధికారి కేవీ రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇఫ్టూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా దళితుల పోరాటాలకు మద్దతుగా ఆగస్టు 6 వరకు సభలు, సమావేశాల నిర్వహణలో భాగంగా మంగళవారం కేఆర్ పురంలో దళిత గిరిజనులు ఆందోళన చేశారు. ఆయన మాట్లాడుతూ దళిత ఆదివాసీలకు గత ప్రభుత్వం సంక్షేమ పథకాలను నిలుపుదల చేయడం దుర్మార్గమన్నారు. మురికివాడల్లో రోడ్ల నిర్మాణం ఇతర అభివృద్ధికి నిధులు వినియోగించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. కోర్స కిషోర్, మీసాల ఏసు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయం, ఉపాధి హామీకి నిధులు పెంచాలి

కామవరపుకోట, జూలై 30 : కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీకి, వ్యవసాయ రంగానికి నిధులు కోత విధించడం దుర్మార్గమని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి పేర్కొన్నారు. మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కామవరపుకోటలోని ఏలూరు రోడ్డులో రాస్తారోకో, ఆందోళన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసే విధంగా కేంద్ర బడ్జెట్ ఉందని స్పష్టం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు జె.సత్యనారాయణ, ముత్యాలమ్మ, ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ, మహంకాళిరావు, ప్రభాకరరావు, గవర సత్యనారాయణ, సీత, హెచ్. మేరి, చంటి తదితరులు పాల్గొన్నారు.



కోటలో రాస్తారోకో చేస్తున్న నాయకులు

'ఇంటింటికీ హిందూ ధర్మ ప్రచారం'

కామవరపుకోట, జూలై 30 : హిందూ ధర్మ ప్రచార భజన కళాకారుల ఆధ్వర్యంలో జీలకర్రగూడెంలోని కోదండ రామాలయం వద్ద ఇంటింటికీ హిందూ ధర్మ ప్రచార కార్యక్రమాన్ని జమిందార్ రాజా రాఘవరాజు వెంకట చిన రామకృష్ణంరాజు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పెద్ద తిరుపతి నుంచి తీసుకువచ్చిన వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ అక్షింతలను, రూపాయి నాణెం, గోవింద నామాలు, విష్ణు సహస్రనామాల పుస్తకాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఇంటింటికీ అందచేశారు. కార్యక్రమంలో కూచింపూడి కృష్ణ, పాములర్తి రామకోటేశ్వరరావు, కేతిరెడ్డి రాజ్యకుమారి, మారంపూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కొత్తూరులోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద, కామవరపుకోటలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం వద్ద ఇంటింటికీ హిందూ ధర్మ ప్రచారాన్ని కళాకారుల సంఘం ప్రతినిధులు నిర్వహించారు.

గుండుగొలనులో పారిశుధ్య కార్యక్రమాలు

భీమడోలు, జూలై 30 : గుండుగొలనులను గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు డ్రెయినేజీ పొంగి పొర్లడంతో అధికారులు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈవోపీఆర్‌డీ సుందరి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ ప్రధాన రోడ్డు సమీపంలోని పలు దుకాణాల వద్ద, మెయిన్ డ్రెయినేజీ తూరలు ధ్వంసం కావడంతో సిల్టు పేరుకుపోయి డ్రెయినేజీ నీరు ముందుకు వెళ్ళకపోవడంతో గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ డ్రెయిన్ పూడిక తీత పనులు నిర్వహించారు. ఈ పనులను డీఎల్‌పీవో చంద్రశేఖర్, ఈవోపీఆర్డఈ సుందరి పర్యవేక్షించి శానిటేషన్, తాగునీరు అందించే కార్యక్రమాలను జాగ్రత్తగా నిర్వహించాలని సిబ్బందికి సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ కార్యదర్శి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కారుపై దాడి అవాస్తవం

డీఎస్పీ సురేష్‌కుమార్ రెడ్డి


విలేకరులకు వివరాలు తెలుపుతున్న డీఎస్పీ

జీలుగుమిల్లి, జూలై 30 : పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కారుపై సోమవారం జరిగిన దాడి విషయమై పోలీసు నిఘా వర్గాలు ఆరా తీశాయి. పోలవరం డీఎస్పీ ఆధ్వర్యంలో సీఐ క్రాంతికుమార్ పలువురు ఎస్సైలు విచారణ జరిపారు. ఎమ్మెల్యే కారుపై దాడి జరిగిందనే వార్తలు, కథనాల్లో వాస్తవం లేదని డీఎస్పీ సురేష్‌కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. ఎమ్మెల్యే ఇంటి వద్ద కారు షెడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో పోల్ వచ్చి కారు అద్దం మీద పడడంతో కొంత డ్యామేజ్ అయ్యింది. సోమ వారం ఎమ్మెల్యే మరో కారులో పర్యటించారు. సాయంత్రం ఎమ్మెల్యే పీఏ, మరో ఇద్దరు ఎమ్మెల్యే అనుచరులు ఇంటివద్ద ఉన్న కారులో బయటకు వెళ్తుండగా బర్రింకలపాడు వద్దకు వచ్చేసరికి రోడ్డు టర్నింగ్ వద్ద కారు వెనుక అద్దాలు కుదుపునకు ఒక్కసారిగా ముక్కలయ్యాయి. దీంతో కారులో ఉన్నవారు ఎవరో తమపై దాడి చేశారని భావించారని తెలిపారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తమకు శత్రువులెవరూ లేరని నియోజకవర్గ ప్రజల ఆదరాభిమానాలే ఉన్నా యని ఎమ్మెల్యే బాలరాజు తెలిపారు. ఈ ఘటనపై విచారణకు జిల్లా అధికా రుల ఆదేశాల మేరకు క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్, ఎస్‌బీ, ఇంటిలిజెన్స్ బృందాలు, ఎస్సైలు చంద్రశేఖర్, వెంకన్న, విష్ణువర్ధన్, దుర్గామహేశ్వరరావు, సాధిక్ ఉన్నారు.



తహసీల్దార్‌కు ఘనంగా వీడ్కోలు

చాట్రాయి, జూలై 30: చాట్రాయి తహసీల్దార్‌గా పనిచేసి బదిలీపై వెళుతున్న మహ్మద్ ముక్సూద్ అలీకి మంగళవారం రెవెన్యూ సిబ్బంది ఘనం గా వీడ్కోలు పలికారు. రాజమహేంద్రవరం కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా పని చేస్తూ 6 నెలల క్రితం ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు చాట్రాయి తహసీల్దార్‌గా వచ్చిన ఆయన సమర్థవంతంగా విధులు నిర్వహించి ప్రజాభిమానం చూరగొన్నారు. డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వరరావుకు చార్జి అప్పగించి మంగళవారం అలీ రిలీవ్ అయ్యారు. అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సిబ్బంది సహకారం అభినందనీయం



ముదినేపల్లి, జూలై 30 : సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వ హించటం, ఇతర విధుల్లో తనకు రెవెన్యూ, ఇతర శాఖ సిబ్బంది సంపూర్ణ సహకారం అందించటం అభినంద నీయమని ముదినేపల్లి తహసీల్దార్ ఎస్.లక్ష్మీ నరస కుమారి అన్నారు. ముదినేపల్లి నుంచి కాకినాడ జిల్లాకు బదిలీ అయిన సందర్భంగా ఆమెను మంగళవారం రెవెన్యూ కార్యాలయ అధికారులు, సిబ్బంది, వీఆర్‌వోలు, వీఆర్‌ఏ సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. డీటీ పవన్ కుమార్, ఆర్ఐ శివ కుమార్, వీఆర్వోల సంఘ అధ్యక్షుడు మురళీ తదితరులు పాల్గొన్నారు. కాగా డిప్యూటీ తహసీల్దార్ పవన్ కుమార్, ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు.

ముసునూరు తహసీల్దార్ బదిలీ




ముసునూరు, జూలై 30: ముసునూరు మండల తహసీల్దార్ జవహర్‌బాజి బదిలీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా రాజమండ్రి జిల్లా రాజమహేంద్రవరం మండలం నుంచి ముసునూరు మండల తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. ఎన్నికల విధులను ఆయన సమర్థవంతంగా నిర్వర్తించారు. ప్రభుత్వం ఇటీవల బదిలీలపై ఇచ్చిన ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం మండల తహసీల్దార్‌గా జవహర్‌బాజి బదిలీపై వెళ్ళారు. మంగళవారం ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, డిప్యూటీ తహసీల్దార్ ఎమిలికుమారి, రీ సర్వే డీటీ శర్మ, వీఆర్వోలు ఆయనను సత్కరించారు.

అధికార్ల గైర్హాజరుపై సభ్యుల ఆగ్రహం

ముదినేపల్లి, జూలై 30 : మండల పరిషత్ సమా వేశానికి ముఖ్య శాఖల అధికార్లు గైర్హాజరుపై మంగళవారం జరిగిన ముదినేపల్లి మండల పరిషత్ సాధారణ సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మాట్లాడుతూ కాల్వలకు సాగునీరు సరిపడినంత రాక వెదజల్లిన వరి పైరు ఎండిపోతున్నది. ఇరిగేషన్ అధికారులు ఎవరూ రాలేదు. ఎవరిని అడగాలి అంటూ పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పీహెచ్‌సీల్లో కుక్క కాటు, పాము కాటు మందులు అందుబాటులో ఉన్నాయా? లేదా అనే అంశంతోపాటు వైద్యశాలపై జరిగిన చర్చ సందర్భంగా వైద్యాధికారులు లేకపోవటంతో సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. ఎంపీపీ సత్యనారాయణ జోక్యం చేసుకుని ఇక ముందు సమావేశాలకు అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో రావాలని, లేకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఇటీవల ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ జడ్పీ హైస్కూల్‌లో పాల్గొన్న విద్యా కిట్ల పంపిణీ కార్యక్రమానికి తనకు విద్యాశాఖ అధికారి ఆహ్వానించకపోవటం పట్ల జడ్పీటీసీ ఈడే వెంకటేశ్వరమ్మ అసంతృప్తి వ్యక్తం చేశారు.

బీసీ కాలనీని పట్టించుకోరా


సర్పంచ్, కార్యదర్శిని నిలదీస్తున్న మహిళలు

మండవల్లి జూలై 30 : మండవల్లి బీసీ కాలనీ మహిళలు మంగళవారం సచివాలయం ముట్టడించారు. కాలనీలో నెల కొన్న సమస్యలపై సర్పంచ్ మెండా ఝాన్సీ సురేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులను నిలదీశారు. తాగునీటిలో పురుగులు వస్తున్నాయని పందులు స్వైర విహారం చేస్తున్నాయని, రోడ్లపైకి మురుగు చేరుకుని దోమలతో ఇబ్బందులు పడుతున్నా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. దీనిపై స్పందించిన సర్పంచ్, కార్యదర్శి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

తూరల పునరుద్ధరణ



లోపూడిలో తూరల వద్ద ఉన్న మట్టిని ఎక్స్‌కవేటర్‌తో తీయిస్తున్న టీడీపీ నాయకులు

ముసునూరు, జూలై 30: లోపూడిలో వేబ్రిడ్జి నిర్మాణం కోసం పూడ్చివేసిన తూరలను టీడీపీ నాయకులు మంగళవారం పునరుద్ధరించారు. తూరలు పూడ్చి వేబ్రిడ్జి నిర్మాణం? శీర్షికన ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆర్‌అండ్‌బి అధికారులు స్పందించారు. జేఈ అశోక్‌కుమార్ క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీ లించి, సమస్య పరిష్కారానికి నిధుల్లేవని, మీరే చొరవ చూపాలని టీడీపీ నాయకులను కోరారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రహ దారి ప్రక్కనే ఉన్న సుమారు ఐదెకరాల పంట పొలం నీట మునగడంతోపాటు రహదారిపై నీరు చేరి, ఇటు రైతులు, అటు వాహనదారులు సైతం పడుతున్న ఇబ్బందులను టీడీపీ నాయకులు గుర్తించారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు వేంపాటి శ్రీనివాసరావు, నాయకులు చలమాల మల్లేశ్వరరావు, లక్కపాము కాంతారావు, నక్కా చెన్నారావు, చలమాల వెంకటేశ్వరావులు తమ సొంత సొమ్ముతో ఎక్స్‌కవేటర్‌ను ఏర్పాటు చేసి, పూడ్చిన తూరలపై ఉన్న మట్టిని తొలిగించి, వేబ్రిడ్జి పక్క నుంచి మూడు అడుగుల లోతు కాలువను ఏర్పాటు చేశారు. దీంతో పొలాలు, రహదారిపై నిల్వ ఉన్న వర్షపునీరు పూర్తిగా పెద్ద చెరువులోకి వెళ్ళింది. దీర్ఘకాలిక సమస్య పరిష్కారం కావడంతో రైతులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం సొమ్ము కోసం.. 30 నెలలుగా ఎదురుచూపు

మిల్లర్లు ఇవ్వాలంటున్న సొసైటీ కార్యదర్శి

ఆమరణ దీక్ష చేస్తానంటున్న కౌలు రైతు

ముదినేపల్లి, జూలై 30 : ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా ధాన్యం అమ్మి 30 నెలలు కావస్తున్నా నేటికీ ఓ కౌలు రైతు పూర్తి సొమ్మును అందుకోనివైనమిది. భూమిని కౌలుకు తీసుకుని సాగు చేసేందుకు పెట్టుబడికి తెచ్చిన అప్పులకు అధిక వడ్డీలు చెల్లిస్తూ ఆర్థికంగా కుంగిపోయాడు ఆ కౌలు రైతు. ముదినేపల్లి మండలం పెదపాలపర్రు గ్రామానికి చెందిన ఈదర జనార్దనరావు నాలుగెకరాల భూమిని అదే గ్రామానికి చెందిన కోడూరు శ్రీనివాసరావు కొన్నేళ్లుగా కౌలుకు చేస్తున్నాడు. 2022 ఖరీఫ్ సీజన్‌లో ఫిబ్రవరి 15న ఆ కౌలు రైతు పెదపాలపర్రు పీఏసీఎస్ ద్వారా 40 కేజీల సామర్థ్యం కలిగిన 258 బస్తాల ధాన్యాన్ని రైతు జనార్దనరావు పేరున అమ్మాడు. అందులో 174 బస్తాలకే సొమ్ము బ్యాంకులో జమ అయింది. మిగిలిన 84 బస్తాల ధాన్యానికి జమ కాలేదు. ఈ విషయమై పీఏసీఎస్ కార్యదర్శిని కౌలు రైతు సంప్రదించగా, రైసు మిల్లు నుంచి బకాయిలు రావాల్సి ఉందని చెప్పటం, కొంతకాలం వేచి చూస్తుండటంతో 30 నెలలు గడిచిపోయింది. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు చేసిన మిల్లరు పెదపాలపర్రు మిల్లును మూసేసి వెళ్లిపోవటం, సొమ్ము చెల్లించకపోవటంపై తనకు సొమ్ము అందుతుందా లేదా అన్న భయంతో ధాన్యం సొమ్ము చెల్లింపులో అవకతవకలు జరిగాయని, విచారణ జరపాలని కౌలు రైతు శ్రీనివాసరావు సహకార శాఖ ఏలూరు డీఆర్ ఇటీవల ఫిర్యాదు చేశారు. శాఖాపరంగా ఎలాంటి కదలిక రాకపోవటంతో కౌలు రైతు మరింత ఆందోళనకు గురవుతున్నాడు. సుమారు రూ.63 వేలు పెండింగ్‌లో ఉండటంతో పెట్టుబడికి అప్పట్లో తెచ్చిన అప్పులకు అధిక వడ్డీలు చెల్లిస్తూనే ఉన్నాడు.


ధాన్యం అమ్మిన పత్రాలను చూపుతున్న కౌలు రైతు శ్రీనివాసరావు

మిల్లరు చెల్లించాలి

రైతు ఈదర జనార్దనరావు పేరిట కౌలు రైతు శ్రీనివాసరావు అమ్మిన ధాన్యానికి సొమ్ము రావాల్సి ఉంది. సుమారు 33 క్వింటాళ్ల ధాన్యం సొమ్ము మిల్లర్ వద్ద పెండింగ్‌లో ఉంది. మిల్లరు అందుబాటులో లేరు. సొమ్మును రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నాం.

-నాగమల్లీశ్వరి, కార్యదర్శి, పెదపాలపర్రు, పీఏసీఎస్

ఆమరణ దీక్ష చేస్తా..

తన సమస్యను త్వరలో అధికారులు పరిష్కరించకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని కౌలు రైతు గుమ్మడి శ్రీనివాసరావు హెచ్చరించారు. పెట్టుబడికి తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నాను. సంఘ కార్యదర్శిని అడిగితే రైసు మిల్లు నుంచి సొమ్ము రావాలి అని చెబుతున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా పరిష్కరించి సొమ్ము ఇప్పించాలని వేడుకుంటున్నాడు.


కోడూరు ఏరియాలో నీరందక ఎండిపోయిన వెదజల్లిన వరి పైరు


ట్రాక్టర్‌కు ఇంజన్ బిగించి డ్రెయిన్ నీరు పొలాలకు తోడుతున్న నీరు

పైరు ఎండుతోంది..

కాల్వలకు అరకొర నీరు

డ్రెయిన్ నీరు తోడుతున్న రైతులు

ముదినేపల్లి, జూలై 30 : ముదినేపల్లి ప్రాంతంలోని వెదజల్లిన సార్వా వరి పైరుకు సాగునీటి ఎద్దడి ఏర్పడింది. మొన్నటి వరకు ఎడతెరిపి లేని వర్షాలకు ముంపునకు గురైన వందలాది ఎకరాల భూములు గత నాలుగు రోజులుగా ఎండలకు బీటలు వారే పరిస్థితి ఏర్పడింది. వెదజల్లిన వరి పైరు నీరందక ఎండిపోతున్నది. క్యాంప్ బెల్, పోల్ రాజ్, బంటుమిల్లి, గుడివాడ ఛానల్స్ పరిధిలోని ఆయకట్టుకు తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడింది. ముంపు నుంచి తేరుకుని మిగిలిన వరి పైరును రక్షించుకునేందుకు ముదినేపల్లి మండలంలోని పలు గ్రామాల రైతులు నానా తంటాలు పడుతున్నారు. గుడివాడ చానల్‌కు శివారున ఉన్న కోడూరు, చినపాలపర్రు, ముదినేపల్లి గ్రామాల పరిధిలోని వరి పొలాలకు మురుగు కాల్వ నుంచి ట్రాక్టర్లకు బిగించిన ఆయిల్ ఇంజన్లతో నీరు తోడుతున్నారు. వెదజల్లిన వరి పైరు ముంపులో నాని పాడైపోయిన పొలాల్లో తిరిగి వరి నారు నాటుతున్నారు. వేలాది రూపాయల పెట్టుబడి పెట్టి వెదజల్లిన వరి పైరు అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల్లో తీవ్రంగా నష్టపోయారు.


క్యాంప్ బెల్ కెనాల్‌లో అరకొర నీరు

కాల్వలకు అరకొర నీరు...

ముదినేపల్లిలోని ప్రధాన పంట కాల్వలకు సాగునీరు అరకొరగా విడుదల చేస్తున్నారు. పుల్లేరుకు కృష్ణానది నుంచి 400 క్యూసెక్కుల నీరు వస్తుండగా, గుడ్లవల్లేరు లాకుల నుంచి క్యాంప్ బెల్ కెనాల్‌కు 130, పోల్‌రాజ్ కెనాల్‌కు 140, బంటుమిల్లి కెనాల్‌కు 130 క్యూసెక్కుల నీటిని సర్దుబాటు చేసి విడుదల చేస్తున్నారు. ఈ నీరు బ్రాంచి కాల్వల ద్వారా శివారు ఆయకట్టు భూములకు అందడం లేదు. మరో వారం రోజుల వరకు నీటి విడుదల పెంచే అవకాశం లేదని అధికారులు చెబుతుండటంతో వెదజల్లిన వరి పైరు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నీటి విడుదల పెంచుతాం..

పంట కాల్వలకు నీటి విడుదల పెంచేందుకు చర్యలు తీసుకుంటామని, నీటి ఎద్దడి సమస్యపై మంగళవారం కృష్ణా జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం (ఐడీబీ) లో కూడా చర్చించారని కైకలూరు డీఈఈ విశ్వకుమార్ తెలిపారు.

శివారు ప్రాంతాలకు నీరివ్వండి: కామినేని


నీటి పారుదల సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న కామినేని

కైకలూరు జూలై 30 : శివారు ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించాలని కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ కోరారు. మంగళవారం ఉమ్మడి కృష్ణా జిల్లా నీటిపారుదల సలహా మండలి సమావేశాన్ని మచిలీపట్నం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కామినేని మాట్లాడుతూ ఎగువన పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ కాలువల సామర్థ్యం మేరకు నీరు విడుదల చేయకపోవడంతో శివారు గ్రామాల్లో ఇంకా తాగునీటి సమస్యలున్నాయని అధికారులకు తెలిపారు. కైకలూరు మండలం ఆలపాడు, పల్లెవాడ గ్రామాలకు నేటికి నీరు చేరలేదన్నారు. అలాగే రైతులు సైతం పంట పొలాల్లో నీరు లేక పూర్తి వర్షాభావంపైన ఆధారపడ్డారని, రెండు రోజులుగా కాస్తున్న ఎండలకు నీరు లేక పంటలు ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. దీనిపై కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ అధికారులతో పాటు తాను కాలువలను ప్రత్యక్షంగా పరిశీలించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అలాగే కాలువలకు వంతుల వారీగా ఐదు రోజుల చొప్పున నీరు అందిస్తామని, అన్ని కాలువలకు ఒకేసారి నీరు విడుదల చేస్తే శివారు ప్రాంతాలకు చేరడం లేదని అందువల్ల ఒక్కో కాలువకు ఐదు రోజుల చొప్పున నీటిని సరఫరా చేయాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

సీఎం దృష్టికి వడాలి భూ వ్యవహారం

ముదినేపల్లి: ముదినేపల్లి మండలం వడాలిలోని సుభద్ర బలరామ సహిత జగన్నాథ స్వామి ఆలయ భూముల వ్యవహారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఉన్నత స్థాయి సమావేశం నిర్ణయించింది. మంగళవారం విజయవాడలో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో దేవదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ కె.సుబ్బారావు, కమిషనర్ ఎస్.సత్యనారాయణ, అడిషనల్ కమిషనర్ రామచంద్ర మోహన్, హెడ్డాఫీసు ఆర్జేసీ చంద్రశేఖర ఆజాద్, ఏసీ సీహెచ్. రంగారావు దేవస్థానంకు చెందిన 1200 ఎకరాల భూములకు సంబంధించి సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై చర్చించారు. భూముల అన్యాక్రాంతం, కౌలు సొమ్ము పెండింగ్ అంశాలతోపాటు, భూములపై దేవస్థానానికి ఉన్న హక్కులపై గతంలో కోర్టులు, ట్రిబ్యునల్స్ ఇచ్చిన తీర్పులను మంత్రి రామనారాయణ రెడ్డికి ఎమ్మెల్యే కామినేనితోపాటు ఉన్నతాధికారులు కూడా వివరించారు. వీటన్నింటిపై సమగ్ర నివేదికను రూపొందించాలని, త్వరలో సీఎం చంద్రబాబుతో చర్చించి ఆలయానికి, రైతులు, అర్చకులకు నష్టం జరగని విధంగా ఒక నిర్ణయం తీసుకుందామని మంత్రి తెలిపారు. పలువురు టీడీపీ నాయకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



ఇంటి పక్కనే ఏర్పాటు చేసిన పెంటపోగు.. రంగు మారిన నీరు

పెంట పోగులతో నీరు కలుషితం

నూజివీడుటౌన్, జూలై 30: నూజివీడు మండలం జంగంగూడెం గ్రామంలో నివాస గృహాల బోర్ల పక్కనే పెంట పోగులను వేయడంతో భారీ వర్షాలకు వాటి నుంచి ఊట దిగి బోర్ల నీరు కలుషితమై అనారోగ్యానికి గురవుతున్నామని గ్రామానికి చెందిన వల్లభనేని కోటేశ్వరరావు అన్నారు. తమ కుటుంబ సభ్యులు డయేరియా లక్షణాలతో ఆసుపత్రిలో చేరారని, తక్షణం పెంటపోగులను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

నూజివీడులో పారిశుధ్య చర్యలు



నూజివీడు టౌన్, జూలై 30: నూజివీడు మున్సిపల్ పరిధిలో భారీ వర్షాలకు అంటువ్యాధులు ప్రబలకుండా డంప్ సైట్లను తొలగిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకట్రామిరెడ్డి అన్నారు. నూజివీడు పట్టణంలోని 9, 10, 12 వార్డుల్లో డంప్ సైట్ల తొలగింపును ఆయన పరిశీలించారు. దోమల నివారణకు మందును పిచికారీ చేయించారు. మున్సిపల్ ఎస్సై నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించాలి: ఏఐఎస్ఏ

నూజివీడు టౌన్, జూలై 30: ఎన్‌టీఏను రద్దు చేసి నీట్ పరీక్షను మరలా నిర్వహించాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులు నూజివీడు చిన్నగాంధీ బొమ్మ సెంటర్లో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి అఖిల్ మాట్లాడుతూ తక్షణం ఎన్‌టీఏను రద్దు చేసి నీట్‌ను నిర్వహించాలని డిమాండ్ చేశారు. నూజివీడు డివిజన్ అధ్యక్షుడు వెంకట్, కార్యదర్శి రియాజ్, సాయి, ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు ఉచిత న్యాయసేవలు

నూజివీడు టౌన్, జూలై 30: వన్ స్టాప్ సెంటర్ల ద్వారా మహిళలకు ఉచిత న్యాయ సేవలతో పాటు, 5 రకాల సేవలు సద్వినియోగం చేసుకునేలా మహిళల్లో అవగాహన కల్పించాలని నూజివీడు ఒకటో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి. వెంకటేశ్వరరావు కోరారు. మంగళవారం నూజివీడు బీసీ బాలికల వసతి గృహంలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలపై విద్యారినులకు అంగన్వాడీలు అవగాహన కల్పించాలన్నారు. వన్ స్టాప్ సెంటర్లపై మహిళలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో నూరానీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుసల్లి సత్యప్రకాష్, కార్యదర్శి రామకృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి, వార్డెన్ సంధ్యారాణి పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల వితరణ



నూజివీడు టౌన్, జూలై 30.: నూజివీడు మండలం కొత్తూరు తండాలో అల్లూరి సీతారామరాజు ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ బాణావతు రవినాయక్, వైస్ చైర్మన్ నాగమణి, సభ్యులు గోపి నాయక్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయండి

ఆర్జీయూకేటీ సెక్యూరిటీ, కేర్ టేకర్లతో డీఎస్పీ



నూజివీడు, జూలై 30: ఆర్జీయూకేటీ నూజివీడు క్యాంపస్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ, కేర్ టేకర్లతో మంగళవారం నూజివీడు డీఎస్పీ లక్ష్మయ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ బాధ్యత కలిగిన స్థానాల్లో ఉన్న మీరంతా ప్రతి సెకండ్ అప్రమత్తంగా ఉండాలని, క్యాంపస్‌లో ఏదైనా అసాధారణ సంఘటన జరిగితే వెంటనే అధికారులకు తెలియజేయాలని, విద్యార్థుల జీవితాన్ని మెరుగ్గా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. ఆర్జీయూకేటీ నూజివీడు నిర్దేశకులు ఆచార్య ఎం. చంద్రశేఖర్, పరిపాలన అధికారి టి.చంద్రశేఖర్, నూజివీడు టౌన్ సీఐ మూర్తి, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ ఆఫీసర్లు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడు డివిజన్‌లో 23 మిల్లీమీటర్ల వర్షపాతం

నూజివీడు టౌన్, జూలై 30: నూజివీడు డివిజన్ పరిధిలో 22.03 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా చింతలపూడి మండలంలో 29.4, అత్యల్పంగా ఆగిరిపల్లిలో 9.4, లింగపాలెంలో 28.4, చాట్రాయిలో 26.6, ముసునూరులో 26, నూజివీడు 12.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

చనుబండలో జిల్లా మలేరియా అధికారి పర్యటన



చాట్రాయి, జూలై 30: ప్రతి ఒక్కరూ బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధులు దరిచేరవని జిల్లా మలేరియా అధికారి పీఎస్ ప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన చనుబండలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. వర్షాకాలంలో ఇంటి ఆవరణలలో, వీధుల్లో మురుగునీరు నిల్వ ఉంటే దోమలు ప్రబలుతాయని గుర్తించాలన్నారు. దోమలు పుట్టకుండా.. కుట్టకుండా చూసుకుంటే జ్వరాలు రావన్నారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని, దోమ తెరలు వాడాలని, వేడి ఆహారం తినాలని, జ్వర లక్షణాలు కన్పిస్తే వెంటనే వైద్య శిబిరానికి వచ్చి చికిత్స పొందాలని, చనుబండలో జ్వరాలు తగ్గే వరకు వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. ఆయన వెంట డివిజనల్ మలేరియా విభాగం అధికారి గోవింద్, పీహెచ్‌సీ వైద్యాధికారి దుర్గాప్రసాద్ ఉన్నారు.

దోమకాటు వల్లే జ్వరాలు

చాట్రాయి, జూలై 30: దోమకాటు వల్లే జ్వరాలు వస్తున్నాయని, ప్రజలు ముందు జాగ్రత్తలు పాటిస్తే జ్వరాల బారిన పడకుండా ఉండవచ్చునని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. చాట్రాయి పీహెచ్‌సీలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎడతెరిపిలేని వర్షాలకు వీధుల్లో మురుగునీరు నిల్వ ఉండి దోమలు పెరుగుతున్నాయని, లార్వా దశలోనే వాటిని నిర్మూలించుకుంటే పరిస్థితి ఇంతవరకు వచ్చేది కాదన్నారు. రెడ్డిగూడెం మండలం శ్రీరాంపురం నుంచి గుబ్బల మంగమ్మ గుడికి వెళ్ళి వచ్చిన వారికి ముందుగా చికున్ గున్యా వచ్చిందని అది చాట్రాయి మండలానికి వ్యాపించిందన్నారు. సీజనల్ జ్వరాలు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో దోమల మందు పిచికారీ చేయించేందుకు చర్యలు చేపట్టామన్నారు.

అంగన్వాడీ కేంద్రానికి ఫ్యాన్ వితరణ

చాట్రాయి, జూలై 30: మండలంలోని పోలవరం అంగన్వాడీ కేంద్రానికి, అదే గ్రామంలో కోనేరు రంగారావు కాలనీ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఆర్. నాగేశ్వరరావు మంగళవారం ఫ్యాన్ అందజేశారు. ఫ్యాన్ లేక చిన్నారులు ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి రావటంతో ఫ్యాన్ అందజేసినట్లు దాత తెలిపారు.

1నే పెన్షన్ల పంపిణీ జరగాలి : ఎంపీడీవో

చాట్రాయి, జూలై 30: సామాజిక పెన్షన్లు 1వ తేదీనే నూరు శాతం పంపిణీ చేయాలని ఎంపీడీవో మంగా కుమారి ఆదేశించారు. చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పెన్షన్ల పంపిణీ సిబ్బందితో ఆమె మాట్లాడుతూ 31నే బ్యాంకుల నుంచి పెన్షన్ సొమ్ము డ్రా చేసి 1వ తేదీ ఉదయం 5 గంటల నుంచే సిబ్బంది పంపిణీ ప్రారంభించాలని కోరారు. మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో 8497 మంది పెన్షన్‌దారులకు రూ. 3.54 కోట్లు పంపిణీ చేయాలన్నారు.

ముసునూరు: లబ్ధిదారుల ఇంటి వద్దే పెన్షన్ సొమ్ము అందేలా ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి తెలిపారు. మండల వ్యాప్తంగా ఆగస్టు నెలకు సంబంధించి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల చెల్లింపు నిమిత్తం 7973 మంది లబ్ధిదారులకు రూ. 3 కోట్ల 34 లక్షల 19 వేలు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఆగస్టు 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచి సచివాలయం, ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగులు ఇంటి వద్దకే వచ్చి పెన్షన్లు పంపిణీ చేస్తారని ఆమె తెలిపారు. అలాగే మిగిలిన పెన్షన్‌లను రెండో రోజు అందజేస్తారని తెలిపారు.

బీజేపీ నేతల హర్షం

ఆగిరిపల్లి, జూలై 30: రాష్ట్రంలో పేదలు ఇళ్ళు నిర్మించుకునేందుకు గ్రామీణ ప్రాంతం వారికి 3 సెంట్లు, పట్టణ ప్రాంత వారికి 2 సెంట్లు చొప్పున స్థలం కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై నూజివీడు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ జి.ఆర్.కె రంగారావు హర్షం వ్యక్తం చేశారు.

ఎస్‌టీయూ నేతలకు కృతజ్ఞతలు

ఆగిరిపల్లి, జూలై 30: రెండు నెలల క్రితం బైక్ ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న తనకు ఎస్టీయూ ఆగిరిపల్లి మండల శాఖ అందించిన ఆర్థిక సాయంతో కోలుకున్నానని బాధితుడు మురారి జగన్ సాయి ఎస్టీయు నేతలకు కృతజ్ఞతలు తెలిపాడు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



ముసునూరు, జూలై 30: విద్యార్థులకు నాణ్యత గల రుచికరమైన ఆహారాన్ని అం దించాలని ఎంఈవో బీవీ సుబ్బారావు అన్నారు. మంగళ వారం కాట్రేనిపాడు జడ్పీ పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, మెనూ రికార్డులను పరిశీలించారు. స్థానిక టీడీపీ నాయకులు గద్దల మోహన్‌రావు, రాపర్ల ప్రతాప్, సూర్యదేవర శ్రీనివాసరావు, రాపర్ల బాలకృష్ణ, బడిపాటి సాంబయ్యలతో కలిసి మధ్యాహ్న భోజనం పదార్థాల నాణ్యత, రుచిని ఆయన తనిఖీ చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయుల విద్యాబోధనపై ఆరా తీశారు. హెచ్‌ఎం బి.అనూరాధ పాల్గొన్నారు.

విద్యా కిట్ల పంపిణీ

ముదినేపల్లి, జూలై 30 : ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని టీడీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి, శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు కోరారు. ప్రభుత్వం తరఫున డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ స్టూడెంట్స్ కిట్స్‌ను మంగళవారం ఆయన శ్రీహరిపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అందజేశారు. వాడవల్లి, వైవాక, కొత్తపల్లి పాఠశాలల్లోను విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు ఆయా గ్రామాల సర్పంచ్‌లు అందజేశారు.